RNI NO .TGTEL/25/A4366

సత్తుపల్లిలో 'రాజమండ్రి' వడ్డీ మాఫియా అరాచకం



3 లో

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: TELANGANA   సంపుటి : 01   సంచిక :78   ఆదివారం 22 ఫిబ్రవరి 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 08   వెల :05/-

## ఢిల్లీలో హై అలర్ట్

ఎర్రకోటపై ఉగ్ర కుట్ర హెచ్చరిక


2 లో

## లైంగిక వేధింపుల కేసు దంపతులకు మరణశిక్ష


2 లో


## నాంపల్లి ఎఫ్ఎస్ఎల్‌లో అగ్నిప్రమాదం

నాగ్‌పూర్ స్పెషల్ టీమ్ కీలక నివేదిక




2 లో

## హైదరాబాద్‌లో మరో భారీ అగ్నిప్రమాదం


2 లో

## నాంపల్లి ఇంటర్ బోర్డు కార్యాలయం ముట్టడి


2 లో

## ఆరు రోజుల్లో పెళ్లి.. అంతలోనే విషాదం


2 లో

## ఆర్ఎస్ఎస్ పరువునష్టం కేసులో రాహుల్‌కు రిలీఫ్


2 లో

# మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ.. లొంగుబాటుకు సిద్ధమవుతోన్న అగ్రనేతలు?

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ అటవీ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కర్రెగుట్టల అటవీ ప్రాంతాల్లో భద్రతా దళాలు విస్తృతంగా కూంబింగ్ కొనసాగిస్తున్న వేళ.. మావోయిస్టు అగ్రనేతలు లొంగుబాటుకు సిద్ధమయ్యారన్న సమాచారం భద్రతా వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇంటెలిజెన్స్ సమాచారం ప్రకారం.. కీలక మావోయిస్టు నాయకులు లొంగుబాటు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో సెంట్రల్ కమిటీ (సీసీ) సభ్యులు, రాష్ట్ర కమిటీ (స్టేట్ కమిటీ) సభ్యులు ఉన్నారని భద్రతా వర్గాలు వెల్లడించాయి. ఇదే నిజమైతే, దక్షిణ జోన్ కార్యకలాపాలపై గణనీయ ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సరెండర్‌పై ఎస్ఐబీకి సమాచారం?

లొంగుబాటు ప్రక్రియపై మావోయిస్టులు తెలంగాణ ప్రభుత్వంతో చర్చలకు యత్నిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ప్రకటించిన పునరావాస విధానాలు, ఆర్థిక సాయాలు, భద్రతా హామీలు ఈ నిర్ణయానికి దారితీసిన కారణాలుగా భావిస్తున్నారు. సుమారు 25 మంది కీలక మావోయిస్ట్ నాయకులు లొంగుబాటుకు సన్నాహాలపై ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో)కు సమాచారం అందినట్లు తెలుస్తోంది. మావోయిస్ట్ అగ్రనేతలు లొంగుబాటుకు



ముందుకొస్తే, ఇది మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బగా మారే ప్రమాదముంది. నియామకాలు, ఆర్థిక వనరులు, కార్యకలాపాల సమన్వయంపై ప్రభావం పడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మావోయిస్టు నేతల లొంగుబాటు అంశంలో అధికారిక ప్రకటన వెలువడే వరకు ఉత్కంఠ కొనసాగనుంది.

## మరింత పేదరికంలోకి పాకిస్థాన్

- 6 సంవత్సరాల్లో 7% పెరుగుదల
- రక్షణ ఖర్చుల ప్రభావం
- 28.8% ప్రజలు దారిద్ర్యరేఖ కింద
- పంజాబ్, సింధ్‌లో ఎక్కువ
- కోవిడ్, వరదలు, ఐఎంఎఫ్ కారణాలు
- భారత్‌లో పేదరికం తగ్గింది


2 లో

# గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు

- గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు సమస్యలు
- ఇందిరమ్మ ఇళ్ల పథకం పరిష్కారం
- పునాది నిలిచిపోయిన ఇళ్లకు ఆర్థిక సాయం
- పునాదులను 400–600 చదరపు అడుగుల మధ్య పరిమితం
- బేస్‌మెంట్ తక్కువ అయితే అదనపు బీమ్‌లు
- పెద్ద బేస్‌మెంట్ ఉంటే గరిష్ట పరిమితం
- డబ్బులు దశల వారీగా జమ
- రూఫ్, స్లాబ్, ఫినిషింగ్ కోసం ప్రత్యేక చెల్లింపులు

మిగతా 2 లో

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు గృహలక్ష్మి పథకం అమలు చేసిన సంగతి తెలిసింది. 2023లో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద పలువురు లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు లబ్ధిదారులకు అప్పటి మంత్రులు, ఎమ్మెల్యే మంజూరు పత్రాలు సైతం అందించారు. దీంతో పలువురు లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు మట్నదలుపెట్టారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా.. ఆ పథకాన్ని రద్దు చేశారు. దాని స్థానంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం కింద పేదల ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు.




## సుప్రీంలీడర్ ఖమేనీని చంపేందుకు అమెరికా ప్లాన్.!

- అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి
- మిడ్ ఈస్ట్‌లో యుద్ధ సిద్ధత, విమానాలు మోహరింపు
- సుప్రీంలీడర్ ఖమేనీ, కుమారుడు లక్ష్యం
- ట్రంప్ ముందు సైనిక ఆప్షన్లు
- ఇరాన్ చుట్టూ 13 యుద్ధ నౌకలు మోహరింపు


2 లో

## హైదరాబాద్ లో ఉగ్రకుట్రకు ప్లాన్..చంచల్ గూడ జైలు ములాకత్ నుంచి విధ్వంసానికి పథకం!

- ముగ్గురు నిందితుల అరెస్టు
- మూసారాంబాగ్, సైదాబాద్, మలక్‌పేట్ పై నిఘా
- లష్కరే–ఈ–తోయిబా ఉగ్రవాదుల చర్చలు
- జైలు నుంచి సమాచార ప్రసారం
- ఎర్రకోట, చాందినీ చౌక్ టార్గెట్ హెచ్చరిక


2 లో

# రాంకీ రాక.. కార్మికుల పోక

## ట్రై కార్పొరేషన్లలో ముదిరిన 'చెత్త' పంచాయితీ

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): హైదరాబాద్ మహానగరంలో పారిశుధ్య నిర్వహణ ఒక్కసారిగా రణరంగంగా మారింది. కొత్తగా ఏర్పడిన ట్రై కార్పొరేషన్ల (జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి) పరిధిలో 'చెత్త' పంచాయితీ ముదిరి పాకాన పడింది. నగరంలో ఇంటింటి నుంచి చెత్తను సేకరించే స్వచ్ఛ ఆటోలను ప్రైవేటు సంస్థ 'రాంకీ' పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ శుక్రవారం వేలాది మంది స్వచ్ఛ ఆటో కార్మికులు జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసును ముట్టడించారు. రాంకీ సంస్థతో కలిసి పనిచేయడం తమకు సాధ్యం కాదని, తమను స్వతంత్రంగానే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జీహెచ్ఎంసీ ఆఫీసు గేట్లను దిగ్బంధించారు. దీంతో నగరవ్యాప్తంగా చెత్త సేకరణ ప్రక్రియ స్తంబించిపోయింది.


2 లో

దశాబ్ద కాలంగా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న తమను, ఇప్పుడు కార్పొరేట్ సంస్థ చేతుల్లో పెట్టడం ఏమిటని స్వచ్ఛ ఆటో కార్మికులు ప్రశ్నిస్తున్నారు. రాంకీ సంస్థ పరిధిలోకి వెళ్తే తమ జీవనోపాధి దెబ్బతినడమే కాకుండా, పని ఒత్తిడి పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ముట్టడితో లోయర్ ట్యాంక్ బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయింది.

# సమయం సందర్భం ఉండక్కర్లేదా?

## ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నిరసనలపై కేటీఆర్ విమర్శలు

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): కాంగ్రెస్ పార్టీ యొక్క సహజ మూర్ఖత్వం కృత్రిమ మేధస్సును మించిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అంతర్జాతీయ వేదికపై రాజకీయ నాటకాలు తగవని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. శనివారం కాంగ్రెస్ పై వరుస ట్వీట్లతో విమర్శలు గుప్పించారు. ఏఐ సమిట్ వద్ద యువజన కాంగ్రెస్ నిరసనపై స్పందిస్తూ యూత్ కాంగ్రెస్ సభ్యులు తమ అల్ప రాజకీయ నాటకాల కోసం 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' ను వేదికగా ఎంచుకోవడం అత్యంత విచారకరం అన్నారు. ఇలాంటి అంతర్జాతీయ వేదికలను నిరసనల కోసం ఉపయోగించడం వల్ల, ప్రపంచ దేశాల ముందు మన దేశం యొక్క ప్రతిష్ట దెబ్బతింటుందన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమే కానీ ఎక్కడ, ఎలా నిరసన తెలపాలో



2 లో

అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం అని రాజకీయ అసమ్మతిని వ్యక్తం చేయడానికి ఒక సమయం, సందర్భం ఉంటాయన్నారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' వంటి అంతర్జాతీయ సదస్సు ఖచ్చితంగా ఇలాంటి నిరసనలకు వేదిక కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే ఏఐ సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు ఈ నిరసన చేపట్టడం విచిత్రం అని ఎద్దేవా చేశారు.

# ఆరు రోజుల్లో పెళ్లి.. అంతలోనే విషాదం

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): ఈనెల 26న పెండ్లి.. అందరిలో ఆనందం, దీనికి సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు, అంతలోనే సంభవించిన అగ్ని ప్రమాదంతో విషాదం నెలకొంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం మంచాతండ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. లాకావత్ అమ్ము కుమారుడు లాకావత్ సోమన్న పెళ్లి ఈనెల 26న జరగాల్సి ఉంది. ఈ శుభకార్యానికి సంబంధించిన బంగారు ఆభరణాలు, బట్టలు, ఇతర వస్తువులు తీసుకొచ్చి తాత్కాలికంగా నివాసముంటున్న పూరిగుడిసెలో దాచిపెట్టారు. ఈ తరుణంలో రాత్రి అకస్మాత్తుగా మంటలు లేచి పూరి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో వధూవరుల, ఇతరుల బట్టలతో పాటు వస్తువులు, సామాగ్రి మొత్తంగా కాలిపోయాయి. దాదాపు రూ.2 లక్షల నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# హైదరాబాద్ లో ఉగ్రకుట్రకు ప్లాన్..

## చంచల్ గూడ జైలు ములాకత్ నుంచి విధ్వంసానికి పథకం!

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): హైదరాబాద్ లో ఉగ్రకుట్రకు ప్లాన్ జరుగుతున్నట్లు నిఘా వర్గాలు అనుమానం వ్యక్తం చేశాయి. చంచల్ గూడ జైలు మూలకత్ నుంచి ఉగ్రకుట్రకు ప్లాన్ చేస్న?న్నట్లు అనుమానిస్తున్నారు. నగరంలో విధ్వంసానికి పథకం రచించినట్లు నిఘా వర్గాలు అనుమానం. జైలు నుంచే ప్రణాళికలు సాగినట్లు అనుమానిస్తున్నారు. వరుస పేలుళ్లకు కుట్ర చేస్తారన్న కేసులో ముగ్గురు నిందితులను ఇప్పటికే అరెస్టు చేశారు.

నగరంలోని మూసారాంబాగ్, సైదాబాద్, మలక్‌పేట్ ప్రాంతాల పై పోలీసులు నిఘా పెట్టారు. లష్కరే–ఈ–తోయిబాకు చెందిన ఉగ్రవాది జైలు నుంచి కుట్ర చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. మూలకత్ కు వచ్చిన వ్యక్తులతో ఉగ్ర దాడులపై సంభాషణలు జరిపినట్లు సమాచారం. ఉగ్రవాది మూలకత్ కు వచ్చిన భార్య ద్వారా సమాచారం చేరవేసినట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉగ్ర కుట్ర నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నగర వ్యాప్తంగా పటిష్ఠ భద్రత చేపట్టినట్లు తెలిపారు.

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుళ్లకు కుట్ర జరుగుతోందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. ఢిల్లీ ఎర్రకోట పరిసరాల్లో బాంబు పేలుళ్ల అలర్ట్ జారీ చేశారు. ఎర్రకోట ముందున్న చాందిని చౌక్ వద్దగల టెంపుల్ టార్గెట్ చేసినట్లుగా రిపోర్ట్ ఇచ్చింది ఇంటెలిజెన్స్. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా ఐ ఈ డి బ్లాస్ట్ లకు ప్రయత్నం చేసిందంటూ కేంద్రాన్ని, ఢిల్లీ పోలీసులను హెచ్చరించింది.

# మరింత పేదరికంలోకి పాకిస్థాన్

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): దక్షిణాసియాలో అన్ని దేశాలు అభివృద్ధిలోకి పరుగులు పెడుతుంటే పాకిస్థాన్ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. గతంలో కంటే ప్రస్తుతం మరింత పేదరికంలోకి వెళ్తోందని తాజా గణాంకాలను బట్టి అర్థమవుతోంది. పాకిస్థాన్‌లో పేదరికం 6 సంవత్సరాల్లో 7 శాతం పెరిగినట్లుగా తాజా సర్వేలను బట్టి వెల్లడవుతోంది.

అభివృద్ధిపై కాకుండా యుద్ధం కోసం విధానాలు రూపొందించే ప్రపంచంలోని కొన్ని దేశాల్లో పాకిస్థాన్ ఒకటి. రక్షణ కోసం ఖర్చు చేసే వ్యయమంతా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుంటుంది. 2024–25లో 28.8 శాతం పాకిస్థానీయులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లుగా వెల్లడైంది. అధిక ద్రవ్యోల్బణం కారణంగా ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా తగ్గడమే ఇందుకు కారణంగా తేలింది.

పాకిస్థాన్ ప్రభుత్వం లెక్కల ప్రకారం.. 2018–19లో పేదరికం రేటు 21.9 శాతం ఉండగా.. ఇప్పుడు 6 సంవత్సరాల తర్వాత 6.9 శాతం పెరిగి 28.8 శాతానికి చేరింది. ఈ ఫలితాలు 2024–25లో నిర్వహించిన సర్వే ఆధారంగా ఉన్నాయి. పాకిస్థాన్‌లోని అన్ని ప్రావిన్సుల్లో.. ముఖ్యంగా పంజాబ్, సింధ్‌లలో పేదరికం పెరిగినట్లుగా పేర్కొంది.

గురువారం పాకిస్థాన్ వెబ్‌సైట్ ది న్యూస్‌తో ఉన్నత అధికారిక వర్గాలు మాట్లాడుతూ.. “గత ఆరు సంవత్సరాల్లో మూడు ఐఎంఎఫ్ స్థిరీకరణ కార్యక్రమాలు, కోవిడ్–19 ప్రభావం, కమోడిటీ సూపర్–సైకిల్, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తక్కువ జీడీపీ వృద్ధి రేటు, రెండు సూపర్ వరదలు, గోధుమ మద్దతు ధరను వదిలివేయడం వంటి అనేక కారణాల వల్ల పాకిస్థాన్‌లో పేదరికం స్థాయి పెరిగింది.” అని అన్నారు.

ఇదిలా ఉంటే గత 6 సంవత్సరాల్లో భారతదేశంలో పేదరికం తగ్గింది. పేదరిక నిర్మూలనలో భారతదేశం విశేషమైన కృషి చేసింది. ప్రపంచ బ్యాంకు ప్రకారం 10 సంవత్సరాలలో 171 మిలియన్ల మందిని తీవ్ర పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చినట్లు భారత ప్రభుత్వం పేర్కొంది. ఇక అన్ని రంగాల్లో భారత్ ముందుకు దూసుకుపోతుంది. వికసిత్ భారత్‌లో భాగంగా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగడంతో పేదరికం తగ్గింది.


# గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు

మొదటి పేజీ తరువాయి

అయితే గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు మాత్రం బిల్లులు చెల్లించలేదు. దీంతో ఏళ్లుగా ఆయా లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా వారి నిరీక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తెరదించింది. మొండిగోడలు, పిల్లర్లతో దర్శనమిస్తున్న గృహలక్ష్మి నిర్మాణాలకు ఊపిరి పోయాలని నిర్ణయించారు. మధ్యలోనే నిలిచిపోయిన ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్నాళ్లు నిధులు లేక నిలిచిపోయిన గృహలక్ష్మి ఇళ్లకు తాజా ఉత్తర్వుల మేరకు ఆర్థిక సాయం సమకూరుతుంది. ఫలితంగా గత మూడేళ్లుగా పునాదులకే పరిమితమైన ఇళ్లు నివాసయోగ్యమైన గృహాలుగా మారనున్నాయి.

అయితే క్షేత్రస్థాయిలో అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకానికి ఎంపిక చేస్తారు. ఇందిరమ్మ ఇళ్ల మార్గదర్శకాల ప్రకారం.. పునాది ప్రాంతం 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల మధ్యనే ఉండాల్సి ఉంటుంది. గృహలక్ష్మి లబ్ధిదారుల ఇప్పటికే నిర్మించిన బేస్‌మెంట్ తక్కువగా ఉంటే దానిని కనీసం 400 చదరపు అడుగులకు తేవటానికి అదనపు పునాది బీమ్‌లను వేసుకోవాల్సి ఉంటుంది. పెద్ద బేస్‌మెంట్ వేసినట్లయితే దాన్ని గరిష్ఠంగా 600 చదరపు అడుగులకు పరిమితం చేయాలి. నిర్మాణాన్ని ఇప్పటికే బేస్‌మెంట్ తీసుకెళ్లిన దృష్ట్యా వారికి ఆ దశ డబ్బులు చెల్లించరు. అయితే బేస్‌మెంట్ తర్వాత మిగిలిన రూ.4లక్షలు దశల వారీగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. రూఫ్ లెవల్ రూ.లక్ష, స్లాబ్ పూర్తయితే మరో రూ.2లక్షలు, ఫినిషింగ్ రూ.లక్ష చొప్పున గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు అందిస్తారు.

# లోన్ యాప్ వేధింపులు.. మరో యువకుడి సూసైడ్



న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): లోన్ యాప్ వేధింపులకు మరో యువకుడు బలయ్యాడు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని కాసానిగూడెంకు చెందిన గిరీష్ (25).. ఇటీవల వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఓ యాప్ లో లోన్ తీసుకున్నాడు. ఆ తర్వాత వేధింపులు మొదలవ్వడంతో.. వాటిని భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. గిరీష్ స్థానికంగా ఉన్న బెల్ కంపెనీలో సెక్యూరిటీగా ఉద్యోగం చేస్తున్నాడని బంధువులు తెలిపారు. ప్రైవేటు యాప్స్ ద్వారా ఇష్టానుసారంగా లోన్లు ఇచ్చి, తిరిగి చెల్లించేంత వరకూ వేధించడం ఎక్కువగా ఉందని బంధువులు వాపోయారు. క్రమం తప్పకుండా లోన్ రీపేమెంట్ చేస్తున్నా.. ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్కువ డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారు. లోన్ ఇచ్చిన కంపెనీ ఎక్కడ ఉందో కూడా తెలీదన్నారు. నిన్న కూడా గిరీష్ సోదరి బ్యాంకుకు వెళ్లి డబ్బులు తీసుకొచ్చిందని తెలిపారు. ఇలాంటి లోన్ యాప్స్ ను ప్రభుత్వం బ్యాన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా.. మృతుడి కుటుంబాన్ని పేర్ని కిట్టు పరామర్శించారు.

# ఢిల్లీలో హై అలర్ట్

## ఎర్రకోటపై ఉగ్ర కుట్ర హెచ్చరిక

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): దేశరాజధాని ఢిల్లీలో ఇంటిలిజెన్స్ అలర్ట్ ప్రకటించింది. ఎర్రకోట వద్ద బాంబు పేలుళ్లకు ఎల్ఈటీ ఉగ్రవాదులు కుట్ర పన్నినట్టు తెలిపింది. పాకిస్థాన్ మసీద్ వద్ద ఇటీవల జరిగిన పేలుళ్లకు ప్రతీకారం తీర్చుకునేందుకు ఉగ్రవాదులు ప్రయత్నం చేస్తున్నారని నిఘావర్గాలు చెబుతున్నాయి. దేవాలయాల వద్ద పేలుళ్లకు కుట్ర చేస్తున్నారని హెచ్చరిస్తున్నాయి. ఎర్రకోట, చాందినీ చౌక్ లోని ఆలయాల వద్ద పేలుళ్లు జరగవచ్చని హెచ్చరికలు జారీ చేశాయి. అంతే కాకుండా ఢిల్లీలోని ఈ ప్రాంతాల్లో బలగాలు మోహరించడంతో పాటు, వీవీఐపీ ప్రాంతాల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఇదిలా ఉంటే గురువారం పలు రాష్ట్రాల్లోని కోర్టులు, స్కూళ్లను లక్ష్యంగా చేసుకుని బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యారు. బంగ్లాదేశ్ సర్వర్ల నుండి నకిలీ బెదిరింపు ఈమెయిల్స్ వచ్చినట్టు గుర్తించారు. ఈ క్రమంలో ఢిల్లీలోని మూడు సీఆర్పీఎఫ్ పాఠశాలలకు సైతం బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఉదయమే మెయిల్స్ రావడంతో విద్యార్థులను ఇంటికి పంపించి తనిఖీలు నిర్వహించారు. అయితే ఈ సోదాలలో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కానీ పేలుడు పదార్థాలు కానీ దొరకలేదు.

# నాంపల్లి ఎఫ్ఎస్ఎల్‌లో అగ్నిప్రమాదం

## నాగ్‌పూర్ స్పెషల్ టీమ్ కీలక నివేదిక

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) అగ్నిప్రమాద కేసులో కీలక పరిణామం చేటుచేసుకుంది. తాజాగా ఈ అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఫైల్స్ పై నాగ్ పూర్ స్పెషల్ టీమ్ కీలక ప్రకటన చేసింది. మొత్తం 1100 ఫైల్స్ దగ్ధమైనట్లు గుర్తించామని పేర్కొంది. దగ్ధమైన ఫైల్స్ ను రికవరీకి ప్రయత్నించామని, డేటా రికవరీ చేయడం సాధ్యం కాదని తేల్చేసింది. ఫిబ్రవరి 7వ తేదీన నాంపల్లిలోని ఎఫ్ఎస్ఎల్ భవనం మొదటి అంతస్తులో అగ్నిప్రమాదం జరగ్గా.. 50 కంప్యూటర్లు, తీవ్రమైన నేరాల్లో పోలీసులు సేకరించిన సాంకేతిక ఆధారాలను పొందుపరిచి సీజ్ చేసిన హార్డ్ డిస్కులు దగ్ధమైనట్లు నాగ్ పూర్ స్పెషల్ టీమ్ రిపోర్టులో తెలిపింది. దగ్ధమైన ఫైల్స్ లో ఒక కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన శాస్త్రీయ ఆధారాలు కూడా కాలి బూడిదైనట్లు సమాచారం. దగ్ధమైన ఫైల్స్ లో ఏమేమి ఉన్నాయన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ రాష్ట్రంలో జరిగే నేర పరిశోధనకు సహాయం అందిస్తుంది. హత్యలు, దోపిడీలు, లైంగిక దాడులు, మోసాలు వంటి కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలు అక్కడే ఉంటాయి. ఎక్కడ ఏ నేరం జరిగినా.. అక్కడ సేకరించిన నమూనాలు, సాంకేతిక ఆధారాలను ఈ ల్యాబ్ కే తరలించి పరీక్షిస్తారు. ఫింగర్ ప్రింట్స్, బ్లడ్, హెయిర్, డీఎన్ఏ టెస్టులు చేస్తారు. తుపాకులు, బుల్లెట్లతో పాటు.. విషాలు, మత్తుపదార్థాలు, గంజాయి, డ్రగ్స్, హెరాయిన్, సంతకాలు, నకిలీపత్రాల పరిశీలన కూడా చేస్తారు.

# మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ..

## లొంగుబాటుకు సిద్ధమవుతోన్న అగ్రనేతలు?

మొదటి పేజీ తరువాయి

అగ్రనేతల కదలికలపై నిఘా..

మావోయిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, సెంట్రల్ కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, ఆంధ్రా ప్రాంతానికి చెందిన మరో కీలక నేత తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్నట్లు కేంద్ర నిఘా వర్గాలకు సమాచారం అందినట్లు తెలుస్తున్నది. అయితే, ఈ వివరాలపై అధికారిక ధ్రువీకరణ లేదు. భద్రతా దళాలు ఈ సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యూహాత్మక చర్యలు తీసుకుంటున్నాయి. భద్రతా దళాలు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించగా.. అనుమానాస్పద కదలికలను గుర్తిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. పరిస్థితులు వేగంగా మారే అవకాశాల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో నిఘా మరింత బలోపేతం చేశారు.

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కూంబింగ్..

తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతాల్లో సంయుక్త బలగాలు విస్తృత కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతను మరింత పెంచారు. అటవీ మార్గాలు, పాత క్యాంపుల ఆనవాళ్లు, ఆయుధ నిల్వ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అవసరమైతే అదనపు బలగాలను సిద్ధంగా ఉంచినట్లు సమాచారం. ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లో చెక్‌పోస్టులు పెంచి, వాహనాల తనిఖీలు కఠినతరం చేశారు. అనుమానాస్పద కదలికలపై డ్రోన్లు, సాంకేతిక పర్యవేక్షణ వ్యవస్థలను వినియోగిస్తున్నారు. ఇరు రాష్ట్రాల సరిహద్దులో గోదావరి నది తీర ప్రాంతాల్లో భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసు దళాలు సంయుక్తంగా పహారా కాస్తున్నాయి. నది దాటే మార్గాలు, అటవీ మార్గాలు, గిరిజన గ్రామాల సమీప ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. రాత్రిపూట గస్తీ బలగాలను పెంచి, నైట్ విజన్ పరికరాలతో తనిఖీలు చేస్తున్నారు.

# లైంగిక వేధింపుల కేసు: దంపతులకు మరణశిక్ష

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): పోక్సో కేసులో ఉత్తరప్రదేశ్ స్పెషల్ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. మాజీ ఇంజినీర్, ఆయన భార్యకు మరణ శిక్ష విధించింది. వీరు 2010 నుంచి పదేళ్లపాటు 33 మంది మైనర్లను లైంగికంగా హింసించినట్లు, వేధించినట్లు ఆరోపణలున్నాయి. దీంతో పాటు ఆ 33 మందికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. నిందితులు చాక్లెట్ల ఆశచూపి మైనర్లను దారుణంగా వేధిస్తూ వీడియోలను చిత్రీకరించి డార్క్‌వెబ్‌లో అమ్మేవారు. విషయం వెలుగులోకి రావడంతో 2020 అక్టోబర్‌లో వీరిని సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. పోక్సో చట్టం, సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఢిల్లీకి చెందిన ఒక వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఇన్నేళ్లు ఈ కేసుపై విచారణ కోర్టు.. చివరకు శుక్రవారం తీర్పు ఇచ్చింది.

# సమయం సందర్భం ఉండక్కర్లేదా?

## ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నిరసనలపై కేటీఆర్ విమర్శలు

మొదటి పేజీ తరువాయి




కేటీఆర్ మరో ట్వీట్ చేస్తూ ఎస్ఎస్‌బీసీ ప్రమాదంపై స్పందించారు. రేవంత్ సర్కార్ చేతకాని పాలనకు పరాకాష్ట ఎస్ఎల్‌బీసీ దుర్ఘటన అన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలి ఏడాది కావొస్తున్నా కార్మికుల మృతదేహాలను వెలికితీయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అయినవారిని కనీసం చివరిచూపు చూసే అవకాశం లేకుండా కార్మికుల కుటుంబాలకు మానసిక క్షోభకు గురి చేసిందని సంవత్సరం గడుస్తున్న మృతదేహాల వెలికితీతలో కానీ సొరంగం పనుల్లో కానీ ఎటువంటి పురోగతి లేకపోవడం రేవంత్ నిర్లక్ష్యానికి, చేతకానితనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకులు కమీషన్లు, కాంట్రాక్టులు, వాటాలపై పెట్టే శ్రద్ధ, ఇకనైనా కార్మిక సంక్షేమం మీద, ప్రజా శ్రేయస్సు మీద పెడితే ఇటువంటి విషాదాలు పునరావృతం కావన్నారు.

# నాంపల్లి ఇంటర్ బోర్డు కార్యాలయం ముట్టడి

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): గుర్తింపు లేని కళాశాలలో అనుమతులు రద్దు చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని టీజేఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో నాంపల్లి ఇంటర్ బోర్డు కార్యాలయాన్ని ముట్టడికి యత్నించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన విద్యార్థులు కార్యాలయం గేటు పైకి ఎక్కి లోపలికి చొచ్చుకు పోవడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయం గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుమతులు లేని విద్యాసంస్థలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న 300 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇంటర్ బోర్డు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా విద్యార్థుల జీవితాలతో ఇంటర్ బోర్డు అధికారులు చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. తక్షణమే 300 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చి , ఎగ్జామ్ రాసేందుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# రాంకీ రాక.. కార్మికుల పోక

## ట్రై కార్పొరేషన్లలో ముదిరిన ‘చెత్త’ పంచాయితీ

మొదటి పేజీ తరువాయి

కమిషనర్ల అత్యవసర భేటీ: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్, సీఎంసీ కమిషనర్ జి.సృజన, ఎంఎంసీ కమిషనర్ ఎం.వినయ్ కృష్ణారెడ్డి అత్యవసరంగా సమావేశమయ్యారు. ఒకవైపు ప్రభుత్వం రాంకీ ద్వారా ఆధునిక పారిశుధ్యం కావాలని కోరుతుండగా, మరోవైపు క్షేత్రస్థాయిలో కార్మికుల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత అధికారులకు తలనొప్పిగా మారింది. పారిశుధ్యం ఆగిపోతే ప్రజల నుంచి వచ్చే ఆగ్రహాన్ని తట్టుకోవడం కష్టమని కమిషనర్లు భావిస్తున్నారు.

స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికులు సహకరించాలి : ట్రై కార్పొరేషన్ల కమిషనర్లు

గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికులు పూర్తి సహకారం అందించాలని ట్రై కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్వీ కర్ణన్, జి.సృజన, టి.వినయ్ కృష్ణారెడ్డి సంయుక్తంగా కోరారు. శుక్రవారం సాయంత్రం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో స్వచ్ఛ ఆటోల డ్రైవర్లు, కార్మికులతో ట్రై కార్పొరేషన్ల కమిషనర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ ఆటో టిప్పర్ పారిశుధ్య కార్మికులు సమస్యలను, విజ్ఞప్తులను విన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు కమిషనర్లు మాట్లాడుతూ.. క్యూర్ పరిధిలోని ట్రై కార్పొరేషన్లలో శానిటేషన్‌ను మరింత మెరుగుపరచాలని స్పష్టం చేశారు. రోడ్లకు ఇరువైపుల, కాలనీలలో చెత్త కనిపించకూడదని సీఎం ఆదేశించారని చెప్పారు. స్వచ్ఛ ఆటో కార్మి కుల సహకారం లేకుండా ఇది సాధ్యం కాదని కమిషనర్లు పేర్కొన్నారు. క్యూర్ పరిధిలోని ట్రై కార్పొరేషన్ పరిధిలో త్వరలో అమలు చేయనున్న100 రోజుల కార్యాచరణలో ప్రణాళిక అమలులో శానిటేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఉందన్నారు. స్వచ్ఛ ఆటోకు కేటాయించిన ఏరియాలో ప్రతి ఇంటి నుంచి 100 శాతం చెత్త సేకరణ చేయాలన్నారు. కార్మికులకు ప్రమాదం జరిగితే ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామన్నారు. ఉద్యోగ భద్రతకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో శానిటేషన్ అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, రవి కిరణ్ యాదగిరిరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో మరో భారీ అగ్నిప్రమాదం

న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): హైదరాబాద్ కేపీఎచ్బీ బస్టాప్ సమీపంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పద్మావతి ప్లాజాలోని సాయి మొబైల్ షాపులో మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం కారణంగా మొబైల్ షాపులోని విలువైన ఫోన్లు, సామాగ్రి దగ్ధం దగ్దం అయినట్టు తెలుస్తోంది. ఇక ఇటీవల నగరంలో అగ్నిప్రమాద ఘటనలు పెరిగిపోతున్న సంగతి తెలిసిందే.

ఇక శుక్రవారం సైతం అమీర్ పేటలోని మైత్రీవనంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కోచింగ్ సెంటర్ లో మంటలు చెలరేగగా అందులో విద్యార్థులు సైతం ఉండిపోయారు. ఫైర్ సిబ్బంది సహాయంతో విద్యార్థులు ప్రమాదం నుండి బయటపడ్డారు. మరోవైపు ఇటీవల ఫర్నిచర్ షాపులో అగ్నిప్రమాదం జరగడంతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లింది. ఇక ఎండాకాలం రావడంతో ప్రమాదాలు పెరిగిపోయే అవకాశం ఉన్నందున ఫైర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు.

# ఆర్ఎస్ఎస్ పరువునష్టం కేసులో రాహుల్‌కు రిలీఫ్



న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): ఆర్ఎస్ఎస్ 2014 పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి రిలీఫ్ లభించింది. ముంబై భీవండి కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఆర్ఎస్ఎస్ కార్యకర్త రాజేష్ కుంటే 2014లో దాఖలు చేసిన పరువు నష్టం కేసులో భాగంగా రాహుల్ గాంధీ భీవండీ కోర్టు ఎదుట హాజరయ్యారు.గతంలో గ్యారెంటర్‌గా ఉన్న శివరాజ్ పాటిల్ చాకూర్కర్ మరణించడంతో, ఆయన స్థానంలో మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ హర్షవర్ధన్ సప్కాల్‌ను కొత్త గ్యారెంటర్‌గా రాహుల్ గాంధీ నియమించారు. సప్కాల్‌ను హామీదారుగా కోర్టు అంగీకరించింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కౌన్సెల్ నారాయణ్ అయ్యర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు ఫాస్ట్ ట్రాక్ ప్రాతిపదికన సాగుతోందని, న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసంతో తాము కోర్టుకు సహకరిస్తున్నామని తెలిపారు. క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని, విచారణను ఎదుర్కొని నిజాన్ని కోర్టు ముందు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నట్లు రాహుల్ గాంధీ ఇప్పటికే సుప్రీంకోర్టుకు తెలిపారని ఆయన పేర్కొన్నారు.

# సుప్రీంలీడర్ ఖమేనీని చంపేందుకు అమెరికా ప్లాన్.!



న్యూస్ డెస్క్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): : అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతూనే ఉన్నాయి. అమెరికా మిలిటరీ కార్యకలాపాలు ఇరాన్‌కు సమీపంలో పెరిగాయి. కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో యూఎస్ ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్లు అనుమతి కోసం వేచిచూస్తున్నాయి. అత్యాధునిక విమానాలు మిడిల్ ఈస్ట్‌కు చేరాయి. మరోవైపు, ఇరాన్ రష్యాలు కలిసి హార్మోజ్ జలసంధిలో యుద్ధ విన్యాసాలు ప్రారంభించాయి. కీలక లక్ష్యాలపైకి మిస్సైల్స్ ప్రయోగించింది.

ఇదిలా ఉంటే, ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ, ఆయన కుమారుడు మోజ్తాబా ఖమేనీని లక్ష్యంగా చేసుకుని హతమార్చేందుకు అమెరికా ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఈ సైనిక ఆప్షన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు ఉంచినట్లు ఆక్సియోస్ నివేదిక తెలిపింది. మొజ్తాబాను సుప్రీంలీడర్ వారసుడిగా అంతా భావిస్తున్నారు. ఇరాన్ అగ్రనేతలతో పాటు కీలకమైన ముల్లాలనను అంతమొందించేలా రక్షణ శాఖ పలు ఆప్షన్లను ట్రంప్ ముందు ఉంచింది.

అయితే, దీనిపై ట్రంప్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ట్రంప్ నిర్ణయం తీసుకుంటే ఇరాన్‌పై అమెరికా దాడులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అధ్యక్షుడు ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారనే దానిపై స్పష్టత లేదని పెంటగాన్ వర్గాలు చెబుతున్నాయి. ఓ వైపు ఇరాన్‌తో అణు చర్చలు జరుపుతూనే అమెరికా సైనికంగా ఆ దేశంపై ఒత్తిడి తీసుకువస్తోంది. ప్రస్తుతం ఇరాన్ చుట్టు పక్కల 13 యుద్ధ నౌకల్ని అమెరికా మోహరించింది. ఇందులో యూఎస్ఎస్ అబ్రహం లింకన్, మరో శక్తివంతమైన జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఉన్నాయి.

# సత్తుపల్లిలో 'రాజమండ్రి' వడ్డీ మాఫియా అరాచకం

## పేదవాడి రక్తం తాగుతున్న వారాల వడ్డీ వలయం!

సత్తుపల్లి,ఆర్ సి,ఫిబ్రవరి21(తెలుగుగళం)న్యూస్:సత్తుపల్లి పట్టణం మరియు చుట్టుపక్కల గ్రామాల్లో ఇప్పుడు ఒక భయంకరమైన ఆర్థిక నేరం నిశ్శబ్దంగా సాగుతోంది. "ఆపదలో ఆదుకుంటాం" అంటూ అడుగుపెట్టిన రాజమండ్రి వడ్డీ వ్యాపారులు, ఇప్పుడు సామాన్యుల పాలిట యమపాశాలుగా మారారు. వారాల వారీ వసూళ్లు, చక్రవడ్డీలు, మరియు అడ్డగోలు పెనాల్టీలతో చిన్న వ్యాపారులు, కూలీలు, మహిళా సంఘాల సభ్యులను నిలువునా దోచుకుంటున్నారు.

వ్యూహాత్మక దోపిడీ: వారం వారం.. ఒక్కో యముడు!

ఈ వడ్డీ దందా వెనుక ఒక పక్కా నెట్‌వర్క్ పనిచేస్తోంది. రాజమండ్రి నుండి ఒక ముఠాగా వచ్చి, వారం అంతా సత్తుపల్లిని చుట్టేస్తున్నారు.

సోమవారం నుండి శనివారం వరకు: ప్రతి రోజు ఒక నిర్దిష్ట వ్యక్తి పట్టణంలోకి వస్తాడు. సోమవారం ఒకరు వస్తే, మంగళవారం మరొకరు. ఇలా ఆరు రోజులు ఆరుగురు ముఠా లా బృందాలు , అప్పులు ఇవ్వడం మరియు వడ్డీలు వసూలు చేయడం చేస్తారు.

దీనివల్ల బాధితుడు ఏ రోజూ అప్పు నుంచి విముక్తి పొందలేకుండా, నిరంతరం ఎవరో ఒక వసూలుదారుడి ఒత్తిడిలో ఉండాల్సి వస్తోంది.

అప్పు ఇచ్చే ముందే దోపిడీ: 'ఫైల్' పేరుతో పది శాతం కటింగ్!

వీరి వడ్డీ లెక్కలు వింటే సామాన్యుల గుండె గుభేల్ అంటుంది. ఒక పేదవాడు అత్యవసరంగా రూ. 5,000 అప్పు అడిగితే:

ఫైల్ చార్జ్ కటింగ్: అప్పు ఇచ్చే ముందే 'ఫైల్ చార్జ్' పేరుతో రూ. 500 నొక్కేస్తారు. అంటే బాధితుడి చేతికి వచ్చేది కేవలం రూ. 4,500 మాత్రమే. కానీ బాధితుడు మాత్రం రూ. 5,000 కే వడ్డీ కట్టాలి.

అడ్డగోలు వడ్డీ: 'ఐదు రూపాయల వడ్డీ' (నెలకు 15% నుండి 20%) పేరిట దోపిడీ మొదలవుతుంది.

కాలపరిమితి: తీసుకున్న డబ్బును కేవలం 3 నెలల లోపు అసలు, వడ్డీతో కలిపి కట్టేయాలి.

చక్రవడ్డీ.. లేట్ పెనాల్టీల ఉచ్చు

వారాల వడ్డీ కట్టడంలో ఒక్క రోజు ఆలస్యమైనా వీరి అసలు స్వరూపం బయటపడుతుంది.

లేట్ పెనాల్టీ: వాయిదా తప్పితే భారీగా జరిమానాలు విధిస్తారు.

చక్రవడ్డీ: వడ్డీ మీద వడ్డీ వేస్తూ, బాధితుడు కట్టిన డబ్బు అంతా కేవలం వడ్డీకే




సరిపోయేలా మాయాజాలం చేస్తారు.

దీనివల్ల చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు తాము కష్టపడి సంపాదించిన డబ్బునంతా ఈ రాజమండ్రి వడ్డీగాళ్లకే ధారపోస్తూ, తిండికి కూడా లేని స్థితికి చేరుకుంటున్నారు.

నిమ్మకు నీరెత్తిన యంత్రాంగం.. అధికారుల బాధ్యత ఎక్కడ?

అనుమతులు లేకుండా అంతర్-జిల్లా వడ్డీ వ్యాపారం బహిరంగంగా సాగుతుంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చట్టం ఏం చెబుతోంది: అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం చేయడం, అధిక వడ్డీ వసూలు చేయడం మనీ లెండింగ్ యాక్ట్ ప్రకారం శిక్షార్హమైన నేరం.

బాధితుల ఆవేదన: భయం వల్ల చాలామంది ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. దీనినే వడ్డీ మాఫియా పెట్టుబడిగా మార్చుకుంటోంది.

సత్తుపల్లిలో వెలుగుచూస్తున్న ఈ వారాల వడ్డీ వ్యవహారంపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించాలి. స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసి, రాజమండ్రి నుండి వస్తున్న ఈ వ్యక్తుల వివరాలు సేకరించాలి. పేదలను ఈ వడ్డీ కోరల నుండి రక్షించి, వారికి బ్యాంకుల ద్వారా సులభంగా రుణాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

# గోదావరి పంకెన పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి తవ్వకాలు

## అనుమానాలకు తావిస్తున్న ఘటన,దర్యాప్తు కోరుతూ గ్రామ ప్రజల డిమాండ్



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి పలిమేల: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పంకెన ప్రాంతం సమీపంలో గోదావరి నది తీరంలో అర్ధరాత్రి వేళల్లో జరిగిన తవ్వకాలు స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయి.రాత్రి సమయంలో యంత్రాలతో నది ప్రవాహ ప్రాంతంలో సుమారు 15 ఫీట్ల లోతు వరకు గొయ్యి తవ్వినట్లు గ్రామస్తులు తెలిపారు.ఈ తవ్వకాలు ఇసుక కోసం చేపట్టినవేనని కొన్ని వర్గాలు చెబుతున్నప్పటికీ, సాధారణ ఇసుక తవ్వకాల కోసం ఇంత లోతు అవసరమా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.స్థానికుల వాంగ్మూలం ప్రకారం, అర్ధరాత్రి సమయంలో కొన్ని వాహనాలు,యంత్రాలు నది తీరానికి చేరుకొని వేగంగా తవ్వకాలు నిర్వహించినట్లు గమనించామని తెలిపారు.నది పరివాహక ప్రాంతంలో రాత్రి వేళల్లో అనుమతి లేకుండా తవ్వకాలు జరపడం నిబంధనలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు.ఈ ఘటనతో పర్యావరణ పరిరక్షణ,నది భద్రత, భూగర్భ వనరుల సంరక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇక 15 ఫీట్ల లోతు వరకు తవ్విన గొయ్యిలో ఏమి లభ్యమైంది అనే విషయంపై అధికారికంగా ఎలాంటి సమాచారం బయటకు రాలేదు.ఈ నేపథ్యంలో తవ్వకాల వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటి? కేవలం ఇసుక కోసం మాత్రమేనా? లేక మరేదైనా విలువైన పదార్థాల కోసం ప్రయత్నించారా? అనే అనుమానాలు ప్రజల్లో చర్చనీయాంశమవుతున్నాయి.గ్రామస్తులు ఈ ఘటనపై సంబంధిత రెవెన్యూ, పోలీసు మరియు గనుల శాఖ అధికారులు తక్షణం స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.అర్ధరాత్రి సమయంలో నది పరివాహక ప్రాంతంలో అనుమానాస్పద తవ్వకాలు జరగడం భద్రతా పరంగా కూడా ఆందోళన కలిగిస్తోందని వారు అభిప్రాయపడ్డారు.ప్రజల డిమాండ్ మేరకు అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ఈ ఘటనపై అధికారుల స్పందన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# ప్రపంచ ఏఐ సదస్సు లో కాంగ్రెస్ యూత్ నాయకులు భారత ప్రతిష్టను దెబ్బతీయాలని చూశారు-బిజెపి జిల్లా నాయకులు జడ సతీష్



తెలుగు గళం న్యూస్/ఫిబ్రవరి 21 వరంగల్ జిల్లా :వర్ధన్నపేట మండలం బిజెపి జిల్లా నాయకులు జడ సతీష్ మీడియాతో మాట్లాడుతూ...ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ ఏఐ సదస్సులో వంద దేశాలకు పైగా ప్రతినిధులు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కంపెనీల సీఈవోలు పాల్గొంటున్న సదస్సులో భారతదేశ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు భారత ప్రధానమంత్రి గారిని వ్యతిరేకించిన విధానం చాలా హాస్యాస్పదంగా ఉందని వారు చేసిన పని వారి నాయకుడు రాహుల్ గాంధీ కి మరియు వాళ్లకు దేశంపై ఉన్న ప్రేమ మమకారాలను చూపెట్టాయని ఇప్పటికైనా ప్రజలు గుర్తించుకోవాలని వారు ఎప్పటికీ భారత ప్రతిష్టను దెబ్బతీయాలనే చూస్తారు తప్ప భారతదేశాన్ని వృద్ధిలోకి తీసుకురావాలి భారతదేశానికి వచ్చే పేరును ముందుండి నడపాలని మాత్రం చూడరని వారి సొంత ప్రయోజనాల కోసం మాత్రమే పాటుపడతారని ఇటువంటి వారిని ప్రజలు ఎన్నిసార్లు తిరస్కరించిన వాళ్లు వారి సొంత ఎజెండాతో పని చేస్తూ ప్రజలను దేశాన్ని మోసం చేస్తున్నారని వాళ్లకు ప్రజలు రాబోయే కాలంలో ఇంకా మంచి గా బుద్ధి చెప్తారని ఇలాంటి వాళ్లను ప్రజలు నమ్మొద్దని పిలుపునిచ్చారు. ఒకవైపు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రాన్ని ఏఐ లో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని డాటా సెంటలను ఏర్పాటు చేస్తానని చెప్తా ఉంటే తెలంగాణ ప్రాంతానికి చెందిన యూత్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఈ దాడిలో పాల్గొనడం వెనక మతలబు ఏంటి అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేక చేయడం మంచిది కాదని ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని వారికి హితవు పలికారు. ఇకపోతే ఈరోజు భూ కబ్జాల గురించి ప్రశ్నించిన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి గారి క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం కూడా రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని మాజీ ముఖ్యమంత్రిని రాష్ట్రానికి ఇప్పుడున్న ముఖ్యమంత్రిని ఎన్నికల్లో ఓడ గొట్టి ఎమ్మెల్యేగా గెలిచిన వెంకటరమణారెడ్డి పై చేసిన ఆరోపణల పై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించిన తరువాత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు అయినా షబ్బీర్ అలీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు పదవిలో ఉండి ఇలాంటి కార్యక్రమాలు కార్యకర్తలతో చేయించడం చాలా హాస్యాస్పదమని ఇలాంటి పనులు చేయడం కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుందని ఆయన కాంగ్రెస్ పార్టీని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ తమ బుద్ధిని మార్చుకోకపోతే రానున్న కాలంలో పార్టీకి వ్యతిరేకంగా మేము కూడా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులను ముట్టడి చేయడం జాతీయ రహదారులను దిగ్బంధం చేయడం రాస్తారోకో లు చేయడం ఎమ్మెల్సీల ఎమ్మెల్యేలను ఇంటిని ముట్టడి చేయడం కూడా మాకు బాగా తెలుసు అని మేము అలాంటి పనులు చేయకుండా ప్రజాస్వామ్యం కోసమే పని చేస్తున్నామని అవి గుర్తించుకోకపోతే కూడా గట్టిగా సమాధానం చెబుతామని జడ సతీష్ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు ధ్యేయం

## ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్"

## ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం చేసిన రాగమయి"







సత్తుపల్లి,ఆర్ సి, ఫిబ్రవరి 21 (తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని పెనుబల్లి మండలం కారాయిగూడెం గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు ను శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలలో ఆశ్వీరదించాలని కోరారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుడు బత్తుల నాగరాజు దంపతులు రాగమయి కు శాలువకప్పి సత్కరించారు.

# రేగొండలో ప్రజాసౌకర్యాల మెరుగుదల

## రేగొండ సర్పంచ్ వారణాసి మౌనిక-అంజి ఆధ్వర్యంలో పోచమ్మ గుడి-పెద్దంపల్లి మార్గంలో చెట్ల తొలగింపు పనులు పూర్తి

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న పిచ్చి చెట్లు, తుమ్మ చెట్లను జెసిబి సహాయంతో తొలగించే ప్రత్యేక శుభ్రతా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.రేగొండ పోచమ్మ గుడి నుండి పెద్దంపల్లి వరకు ఉన్న ప్రధాన మార్గంలో ఈ చర్యలు చేపట్టడంతో గ్రామ ప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణించగలుగుతున్నారు.గ్రామ సర్పంచ్ వారణాసి మౌనిక అంజి, ఉపసర్పంచ్ ఎల్దండీ నరేష్,గ్రామపంచాయతీ పాలకవర్గం పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టబడింది.రహదారి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, తుమ్మ చెట్లు వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారడమే కాకుండా ప్రమాదాలకు దారి తీసే పరిస్థితి నెలకొన్నందున ప్రజల విజ్ఞప్తి మేరకు వెంటనే చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.జెసిబి యంత్రాల సహాయంతో రహదారి పరిసరాలను శుభ్రపరచి, చెట్లను వేరుతో సహా తొలగించడం జరిగింది. తద్వారా రహదారి వెడల్పు పెరగడంతో పాటు దూరం నుంచే వాహనాలు స్పష్టంగా కనిపించే పరిస్థితి ఏర్పడింది.ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, రైతులు, మహిళలు రోజువారీగా ఈ మార్గాన్ని వినియోగించుకుంటున్న నేపథ్యంలో ఈ చర్యలు ప్రజల భద్రతకు ఎంతో ఉపయోగపడుతున్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.గ్రామపంచాయతీ పాలకవర్గం మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి మరియు ప్రజల సౌకర్యాలే తమ ప్రాధాన్యమని, రాబోయే రోజుల్లో కూడా రహదారి సంరక్షణ, పారిశుద్ధ్య పనులు, చెట్ల నియంత్రణ వంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు.అవసరమైతే మరిన్ని మార్గాల్లో కూడా ఇలాంటి శుభ్రతా చర్యలు చేపట్టి గ్రామాన్ని సురక్షితంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.స్థానిక ప్రజలు గ్రామపంచాయతీ తీసుకున్న ఈ తక్షణ చర్యను అభినందిస్తూ,ప్రజల ఇబ్బందులను గుర్తించి స్పందించిన



సర్పంచ్, ఉపసర్పంచ్ మరియు పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. రహదారి స్వచ్ఛత, భద్రత మెరుగుపడటంతో గ్రామంలో సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ ఏర్పడిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి చర్యలు మరింత ఊతమివ్వాలని ప్రజలు ఆకాంక్షించారు.

# ఈ నెల 26న జిల్లా కేంద్రంలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 26వ తేదీన ఉదయం 11 గంటలకు సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్డీఓ హరికృష్ణ తెలిపారు.జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్లో జరిగే ఈ కార్యక్రమానికి అధికారులు, బంజారా సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా నిలిచి,సమాజంలో ఐక్యత, సేవా భావం, నైతిక విలువలను విస్తరించడంలో విశేష పాత్ర పోషించిన మహనీయుడని ఆర్డీఓ పేర్కొన్నారు. ఆయన బోధనలు సమాజ అభ్యున్నతికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, యువత ఆయన జీవన స్ఫూర్తిని ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.జయంతి సందర్భంగా సంత్ సేవాలాల్ జీవిత విశేషాలు, సేవా కార్యక్రమాలు, సమాజ అభివృద్ధిపై ఆయన చేసిన కృషిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తి గీతాలు, సాంప్రదాయ బంజారా కళాప్రదర్శనలు, ప్రముఖుల సందేశాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.కార్యక్రమం సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులు, ప్రజలు క్రమశిక్షణతో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకలు జిల్లాలో సామాజిక ఐక్యతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# మృతుల కుటుంబాలను పరామర్శించినా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి




తెలుగు గళం న్యూస్ చెన్నారావుపేట: మండలంలోని పలు మృతుల కుటుంబాలను పరామర్శించి వారి అంతిమయాత్రలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మండల నాయకులు కడుదురి సంపత్ రెడ్డి నానమ్మ కడుదురి రాజమల్లమ్మ అనారోగ్యంతో కన్నుమూయగా విషయం తెలుసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కడుదురి రాజమల్లమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం లింగగిరి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ ముఖ్య నాయకులు ఓరుగంటి నర్సింగరావు గుండెపోటుతో మరణించగా విషయం తెలుసుకున్న వెంటనే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి అంతిమ యాత్రలో పాల్గొన్న ఆయన, వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెబుతూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో: మండల పార్టీ అధ్యక్షులు బాల్నే వెంకన్న. మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్ గారు. నెక్కొండ మండల సీనియర్ నాయకులు గటిక అజయ్ కుమార్ .మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అమ్మ రాజేష్ . మండల ప్రధాన కార్యదర్శి మాదారపు శ్రీనివాస్.సొసైటీ చైర్మన్ మురహరి రవి.గ్రామ పార్టీ అధ్యక్షులు నార్లపురం ఐలయ్య. ఎంపిటిసి కడారి సాయిలు. పరకాల రాజన్న. లింగగిరి సర్పంచ్ మేడబోయిన రజిత కుమారస్వామి మండల నాయకులు ఎర్ర మల్లారెడ్డి



. మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ బోడ మురళి నాయక్.గొర్ల సంఘం అధ్యక్షులు కడారి బీరయ్య. మండల ఉపాధ్యక్షులు మరాటి రాజు గ్రామ యూత్ అధ్యక్షులు మురహరి రంజిత్. ముసుకు ఐలయ్య. ఎర్ర రాజన్న . మోగులోజు నాగన్న. గోవింద్ సంపత్. సిద్ధన రమేష్. కడుదురి రాజు.కాట్ల రాములు. సముద్రాల యాకయ్య. మండల నాయకులు.గ్రామ నాయకులు. లింగగిరి ముఖ్య నాయకులు. కార్యకర్తలు.పార్టీ ముఖ్య నాయకులు. ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమానికి ఐఎన్టీయూసీ కృషి

**ఐఎన్టీయూసీ నాయకులు తీగల క్రాంతి కుమార్ , కోటేశ్వరరావు**



సత్తుపల్లి,ఆర్ సి,ఫిబ్రవరి21(తెలుగుగళం)న్యూస్:సత్తుపల్లి పట్టణం సింగరేణి లో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ , ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సత్తుపల్లి క్యాంప్ కార్యాలయంలో జే.వి.ఆర్ ఓసి ఫిట్ సెక్రటరీ రామారావు ఆధ్వర్యంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు అధ్యక్షతన జే.వి.ఆర్ ఓసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ సెక్రెటరీ తీగల క్రాంతికుమార్ పాల్గొన్నారు.సత్తుపల్లి జే.వి.ఆర్ ఓసి ఫిట్ కమిటీ మార్పు , ఇతర కమిటీలలో నాయకులకు అవకాశం , ఐఎన్టీయూసీ యూనియన్ బలోపేతం కోసం చర్చించారని తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఐఎన్టీయూసీ యూనియన్ కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తుందని సింగరేణిలో ప్రాతినిధ్య సంఘంగా ఉన్నప్పటికీ జనక్ ప్రసాద్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో నూతన ఉద్యోగుల రిక్రూట్మెంట్ , డిపెండెంట్ ల వయోపరిమితి పెంపు , ఉద్యోగులకు 1.25 కోట్ల రూపాయల ప్రమాద బీమా , కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రాఫిట్ బోనస్ ఇప్పించామని , ఉద్యోగుల సొంత ఇంటి కల , ఆదాయపన్ను రాయితీ ఇతర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం , సింగరేణి యాజమాన్యంతో చర్చించి త్వరలోనే కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.సింగరేణిలో ఎప్పుడు ఎన్నికలు జరిగిన ఐఎన్టీయూసీ యూనియన్ సిద్ధంగా ఉందని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో సింగరేణిలో రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీ యూనియన్ గెలుస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు నాగ ప్రకాష్ , సీతారామరాజు నాయకులు సురేష్ , శ్రీధర్ , పొట్టి కిరణ్ , ఐ.వి.రెడ్డి , మురళీకృష్ణ , శ్రీనివాస్ రాము , తిరుమలరావు , రామచందర్ , రమేష్ , ఇక్బాల్ , సుదర్శన్ , రామారావు ,శ్రీనివాస చారి , శ్రీనివాసరావు , అశోక్ , సదానందం , సుదర్శన్ , గణేష్ , వెంకటేశ్వర్లు , షాట్రాక్ బాబు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కొడవటంచలో ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం

## మహోన్నతంగా ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి శ్రీకారం
## కన్నుల పండుగగా సాగిన స్వామివారి పునః ప్రతిష్ట మహోత్సవం
## మహోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,చిన్న జీయర్ స్వామి
## అభివృద్ధికి అదనపు నిధుల సహకారానికి స్పీకర్ హామీ




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ/కొడవటంచ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం శనివారం అపూర్వ భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించబడింది.శతాబ్దాలుగా ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సాంస్కృతిక సంప్రదాయాలకు కేంద్రంగా నిలిచిన ఈ క్షేత్రం పునరుద్ధరణతో కొడవటంచతో పాటు పరిసర మండలాల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది.వేదమంత్రాల ఘోష, హోమధూమాల పరిమళం, భక్తుల హర్షధ్వానాలతో ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మంచి చేసే వారికి ఎల్లప్పుడూ భగవంతుని ఆశీస్సులు లభిస్తాయని పేర్కొంటూ, ఆలయాలు కేవలం పూజా స్థలాలే కాక సమాజానికి నైతిక దిశానిర్దేశం చేసే ఆధ్యాత్మిక విద్యాలయాలుగా నిలుస్తాయని అన్నారు.భక్తి, సేవాభావం,ధర్మాచరణలతో కూడిన జీవనం సమాజాన్ని శ్రేయస్సు వైపు నడిపిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఆలయ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ మద్దతు: ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12.15 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు సభాపతి వెల్లడించారు.ఈ నిధులతో గర్భగుడి, ప్రధాన మండపం, ప్రదక్షిణ మార్గం పునరుద్ధరణ, భక్తులకు సౌకర్యవంతమైన దర్శన ఏర్పాట్లు, వేచివుండే మండపాలు,తాగునీటి సదుపాయాలు,విద్యుత్ పారిశుద్ధ్య వసతుల విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించిన విధంగా ఆలయ విస్తరణకు అదనంగా రూ.28 కోట్ల నిధుల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన సహకారం అందిస్తానని సభాపతి హామీ ఇచ్చారు.

కొంగు బంగారం కోటంచ లక్ష్మీనరసింహస్వామి--ఎమ్మెల్యే సత్తన్న: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ కొడవటంచ ఆలయానికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చి తన మొక్కులు తీర్చుకున్నారని, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం లక్ష్మీ నరసింహస్వామి అని,అంత ప్రసిద్ధిగాంచిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అభివృద్ధి పరచడం తన పూర్వజన్మ సుకృతం అని అన్నారు. ఆలయానికి వచ్చే రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.85 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం,ప్రాంతీయ పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.చిన్న జీయర్ స్వామి మాటల్లోంచి మరో యాదాద్రిగా కోటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం అభివృద్ధి చెందుతుందని అనడం తనకు మిక్కిలి సంతోషాన్ని కలిగించిందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలు, భక్తులు, విదేశాల్లోని ఎన్నారైలు తమకు తోచిన విధంగా విరాళాలు అందించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

శాస్త్రోక్త పునఃప్రతిష్ఠ--ఆధ్యాత్మిక పరవశం: పునఃప్రతిష్ఠ మహోత్సవంలో సంప్రోక్షణ, యాగశాల కార్యక్రమాలు, కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి వంటి శాస్త్రోక్త క్రతువులు చిన్న జీయర్ స్వామి వారి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి.ఆలయ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించగా, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. సభాపతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా,పోలీసు గౌరవ వందనం సమర్పించబడింది.భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రత్యేక



దర్శన, భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

చిన్న జీయర్ స్వామి ప్రవచనాలు-ధర్మ మార్గానికి పిలుపు: మహోత్సవంలో చిన్న జీయర్ స్వామి చేసిన ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.భక్తి అనేది వ్యక్తిగత సాధన మాత్రమే కాక సమాజ సేవకు దారితీసే జీవన విధానమని ఆయన ఉపదేశించారు.ధర్మాచరణ,పరస్పర గౌరవం, సేవాభావం సమాజాన్ని శాంతి, శ్రేయస్సు వైపు నడిపిస్తాయని వివరించారు.ఆలయాలు మనసుకు ప్రశాంతతను,సమాజానికి ఐక్యతను అందించే పవిత్ర కేంద్రాలుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

భక్తుల సందోహం,సేవా కార్యక్రమాలు:

పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని దర్శించేందుకు ఉమ్మడి వరంగల్ కరీంనగర్ జిల్లాల నుంచి పరిసర గ్రామాలు, పట్టణాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.ఆలయ ప్రాంగణం నిండా భక్తులతో కళకళలాడగా,అన్నదాన కార్యక్రమాలు, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించబడ్డాయి.సేవా కార్యక్రమాలలో యువత, సేవాసంస్థలు చురుకుగా పాల్గొని కార్యక్రమ విజయానికి తోడ్పడ్డారు.

ప్రాంతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి: ఆలయం కొత్త వైభవాన్ని సంతరించుకుని ప్రాంతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా ఎదుగుతుందని స్థానికులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.మౌలిక వసతుల విస్తరణ, రహదారి అభివృద్ధి,భక్తుల సౌకర్యాల పెంపుతో ప్రాంతీయ పర్యాటకాభివృద్ధికి కూడా ఊతమిస్తుందని అభిప్రాయపడుతున్నారు.భక్తి, సంప్రదాయం, ప్రభుత్వ మద్దతు, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ మహోత్సవం కొడవటంచ గ్రామానికి ఆధ్యాత్మిక, సామాజిక ప్రాధాన్యాన్ని మరింత పెంచిందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిష్టమైన భద్రతా ఏర్పాట్లు: స్వామివారి పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆలయ చైర్మన్ సంపత్ రావు, ఈఓ మహేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామ్ నర్సింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి రవీందర్రావు, మోడెం ఉమేష్ గౌడ్, మేకల బిక్షపతి, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.భద్రతా పరంగా డీఎస్పీ సంపత్ రావు ఆధ్వర్యంలో సిఐలు కరుణాకర్ రావు, మల్లేష్ యాదవ్, రేగొండ ఎస్సైలు రాజేష్, సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి తదితరులు విస్తృత బందోబస్తు నిర్వహించారు.వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సేవా సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రేగొండ సర్పంచ్

**యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపు**



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ: రేగొండ గ్రామ సర్పంచ్ వారణాసి మౌనిక అంజి ఈరోజు రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్‌ను స్పీకర్ అభినందిస్తూ,యువత రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు.సమావేశంలో గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యలు, ప్రజల సంక్షేమ కార్యక్రమాలపై చర్చ జరిగింది. గ్రామ స్థాయిలో పారిశుద్ధ్యం, రహదారులు, తాగునీటి సదుపాయాలు,ప్రజాసౌకర్యాల మెరుగుదల వంటి అంశాల్లో యువ నాయకత్వం కీలక పాత్ర పోషించగలదని స్పీకర్ పేర్కొన్నారు.యువత సామాజిక బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చి పారదర్శకంగా సేవ చేస్తే గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.వారణాసి మౌనిక అంజి సేవాభావంతో ప్రజల మధ్య పనిచేస్తున్న తీరు ప్రశంసనీయమని స్పీకర్ పేర్కొన్నారు.గ్రామాల స్థాయిలో సదుపాయాల పెంపు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే నాయకత్వం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆయన తెలిపారు.గ్రామాల సమగ్ర అభివృద్ధి జరిగితే జిల్లా,రాష్ట్రం,దేశం కూడా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని స్పీకర్ విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ వారణాసి మౌనిక అంజి మాట్లాడుతూ,గ్రామ ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తానని,ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తానని తెలిపారు.గ్రామ సమస్యలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లి పరిష్కారానికి కట్టుబడి ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ భేటీతో రేగొండ గ్రామ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్థాయి నాయకత్వం మరియు రాష్ట్రస్థాయి మార్గదర్శకత్వం సమన్వయంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని వారు తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే నాగరాజు




తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఫిబ్రవరి 21 వరంగల్ జిల్లా: పర్వతగిరి మండల పరిధిలోని పలు గ్రామాల్లో జరిగిన వివాహ మహోత్సవాలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి







తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం ఫిబ్రవరి 21, ఖమ్మం జిల్లా: 25వ తారీఖు నాడు ఖమ్మం బంజారా భవన్లో అధికారికంగా నిర్వహించబడే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఖమ్మం జిల్లా బంజారా భవన్లో సమావేశం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో బంజారా సంఘ నాయకులు విద్యార్థి సంఘ నాయకులు మహిళా సంఘం నాయకులు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ 25వ తారీకు ఉదయం 10 గంటలకు సేవాలాల్ మహారాజ్ పోగ్బండారో కార్యక్రమం ఉంటుందని తర్వాత భజన కార్యక్రమం బంజారా సాంస్కృతి సాంప్రదాయ నృత్యాలు ఆటపాటలతో అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కార్యక్రమానికి వచ్చినటువంటి ముఖ్య అతిధుల చేత అధికారుల చేత ప్రసంగాలు ఉంటాయని అనంతరం ప్రసాద వితరణ ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమం పోస్టర్ను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు భానోత్ కిషన్ నాయక్, బిక్షపతి రాథోడ్, రాంబాబు నాయక్, శివ లాల్ నాయక్, ఉపాధ్యాయ నాయకులు, సేవాలాల్ విద్యార్థి సేవల విద్యార్థి సేన అధ్యక్షుడు పదవి ఉపాధ్యాయ నాయకులు శోభన్ నాయక్ సోమ్లా నాయక్ నాయక్, తారాబాయి, సేవాలాల్ విద్యార్థి సేన అధ్యక్షుడు సాయి నాయక్, హరి, తరుణ్, కమల్, స్టాలిన్ నాయక్, వినోద్ నాయక్, రమేషు, నవీను, సాగర్, అడ్వకేట్ జేఏసీ నాయకులు హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన సర్పంచ్



తెలుగు గళం న్యూస్ అయినవోలు ఫిబ్రవరి 21: హనుమకొండ జిల్లా అయినవోలు మండల కేంద్రంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను స్థానిక సర్పంచ్ గడ్డం రఘువంశి గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలింతలకు పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని అంగన్వాడీ కేంద్రంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తిలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం




తెలుగు గళం న్యూస్ భద్రాచలం: భద్రాచలం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయంప్రతి పత్తిలో రోటరీ క్లబ్ మరియు తెలుగు విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ కే జాన్ మిల్టన్ గారు అధ్యక్షత వహించారు. అధ్యక్ష ఉపన్యాసంలో ఆయన భాష ప్రవాహం లాంటిదని, ఎవరికివారు తమ తమ మాతృభాషలను పరిరక్షించుకోవాలి అన్నారు. భాష మాత్రమే మానవుని ఇతర జీవుల నుంచి వేరు చేస్తుందని తెలిపారు.ప్రత్యేక ఆహ్వాని తులుగా విచ్చేసిన పూర్వ ప్రధానాచార్యులు సిద్ధులు మాస్టారు మాట్లాడుతూ చైనా దేశం నేడు ప్రపంచ అగ్రగామి దేశంగా ఎదగడానికి ప్రధాన కారణం చైనీస్ భాష పట్ల వారికి ఉన్న నిబద్ధతని తెలియజేశారు. మరొక పూర్వ ప్రధాన ఆచార్యులు శ్రీ భద్రయ్య మాట్లాడుతూ నేటి సమాజంలో మాతృభాషతోపాటు అన్య భాషలో నేర్చుకోవలసినటువంటి ఆవశ్యకతను తెలియజేశారు. చివరిగా కళాశాల సి పి డి సి సెక్రెటరీ రోటరీ క్లబ్ అధ్యక్షులు అయినటువంటి బుసిరెడ్డి శంకర్ రెడ్డి మాట్లాడు మాట్లాడుతూ గిరిజన భాషలను గిరిజనులు మాట్లాడి వారి భాషలను ఆ భాషలోని యాసను సంరక్షించుకోవాలని చెప్పారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ కపిల భారతి, తెలుగు విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎన్ .సుబ్బరాజు అకాడమిక్ కోఆర్డినేటర్ హిమజ, పరీక్షల నియంత్రణ అధికారి శ్రీనివాసరావు చరిత్ర విభాగాధిపతి కిరణ్ కుమార్ మరియు ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రేగొండ మండలంలో వ్యవసాయ మోటర్ దొంగతనాలు

## 12 మంది రైతులకు చెందిన మోటర్లు ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలంలో రైతులను ఆందోళనకు గురిచేసే విధంగా వ్యవసాయ మోటర్ దొంగతనాలు చోటుచేసుకున్నాయి.డీబీఎం 38 కెనాల్ పరిధిలో పంటలకు నీరు అందించేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న మోటర్లను గుర్తు తెలియని వ్యక్తులు గత అర్ధరాత్రి సమయంలో ఎత్తుకెళ్లిన ఘటన వెలుగులోకి వచ్చింది.స్థానికంగా వరి, మిరప తదితర పంటలను సాగు చేస్తున్న రైతులు కెనాల్ నీటిని పొలాలకు మళ్లించేందుకు విద్యుత్ మోటర్లను ఏర్పాటు చేసి వినియోగిస్తున్నారు.అయితే రాత్రి వేళలను లక్ష్యంగా చేసుకున్న దుండగులు క్రమబద్ధంగా పనిచేసి,సుమారు 12 మంది రైతులకు చెందిన మోటర్లను ఒక్కసారిగా అపహరించినట్లు తెలుస్తోంది.ఉదయం మీరు పెట్టేందుకు పంటల దగ్గరకు వెళ్లిన రైతులకు మోటర్లు కనిపించకపోవడంతో షాక్‌కు గుర్రై,వెంటనే రేగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ ఘటనపై స్పందించిన రేగొండ ఎస్సై రాజేష్ మాట్లాడుతూ, రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నామని,అనుమానితుల గుర్తింపునకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సమీప ప్రాంతాల్లోని స్క్రాప్ దుకాణాలు, వాహనాల కదలికలు, రాత్రి సమయంలో అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై ప్రత్యేకంగా నిఘా పెంచినట్లు తెలిపారు.మోటర్ దొంగతనాలతో రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టపోయే పరిస్థితి నెలకొంది. సాగు సీజన్ మధ్యలో మోటర్లు కోల్పోవడంతో పంటలకు నీటి సరఫరా అంతరాయం కలగవచ్చని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు పోలీసుల నుండి గస్తీ పెంపు, రాత్రివేళల పహారా, నేరస్తులను త్వరితగతిన పట్టుకోవాలని కోరుతున్నారు.ఈ ఘటనతో రేగొండ మండలంలో భద్రతా చర్యలపై చర్చ మొదలైంది.వ్యవసాయ పరికరాల రక్షణకు రైతులు పరస్పర సహకారంతో నిఘా బలపరచాలని అధికారులు సూచిస్తున్నారు.దర్యాప్తు పురోగతిపై త్వరలో మరిన్ని వివరాలు వెల్లడించనున్నట్లు పోలీసులు తెలిపారు.

# సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి వేడుకలు

### ఉత్సవం లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

### పీడిత వర్గాల సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్

### బంజారా సోదర సోదరీమణులతో కలిసి డాన్స్ చేసిన ఎమ్మెల్యే నాగరాజు

### బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణం కోసం సహకారం అందిస్తా ఎమ్మెల్యే నాగరాజు





తెలుగు గళం న్యూస్/ఫిబ్రవరి 21: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం రోళ్ళకల్ చెరువుముందు తండాలో నిర్వహించిన సంత్ శ్రీ సేవా లాల్ మహారాజ్ జయంతి ముగింపు ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బంజార సోదరులు సంప్రదాయ తలపాగాలను ధరింపజేసి శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.అనంతరం సంత్ శ్రీ సేవా మహారాజ్ గుడి నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా పర్వతగిరి మండల పరిధిలోని సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ..సంత్ సేవాలాల్ మహారాజ్ తన జీవితాంతం నిత్యం బంజారాల కోసమే పనిచేస్తూ వారి సంక్షేమానికి, హక్కుల సాధనకు కృషి చేశారని, లంబాడా సోదరులు భూమిని సేద్యం చేసుకుంటా భూమిపై ఆధారపడి బతుకుతారని, లంబాడ కులస్తుల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని, గతంలో ఇందిరాగాంధీ లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని గుర్తు చేశారు. గిరిజన సోదర, సోదరీమణుల సహకారంతోనే తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటయిందని, వర్ధన్నపేట ఎమ్మెల్యేగా నా గెలుపులో లంబాడ సోదరులది కీలకపాత్ర అని, మొన్న జరిగిన వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల్లోను తండాల్లోని మూడు వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులని ప్రజలు గెలిపించారని అన్నారు. కొంత సేవాలాల్ మహారాజ్ యొక్క జీవిత చరిత్ర, గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు చాటిచెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, వారు చూపిన బాటలో నడుస్తూ వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సేవాలాల్ మందిరం ఏర్పాటు కోసం భూమి, మందిరాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన దాతలను వర్ధన్నపేట ఎమ్మెల్యే అభినందించారు. చదువు మన తలరాతను మారుస్తుందని, విద్యార్థులు చిన్ననాటి నుంచే చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, లంబాడ సోదరులకు అనునిత్యం అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, లంబాడ సోదరులకు రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ముందుకు వెళ్తామని,చెప్పారు.ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దేవి మంగ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, సర్పంచులు తొర్రి పద్మ, గాడుదల రవి స్థానిక నాయకులు గిరిజన సోదర సోదరీమణులు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో "రైతుబడి అగ్రి షో"లో భూపాలపల్లి రైతుల సందర్శన

### ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై ప్రత్యక్ష అవగాహన

### తక్కువ ఖర్చుతో అధిక దిగుబడుల దిశగా రైతుల అడుగులు





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి, కాటారం డివిజన్ పరిధిలో ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించే లక్ష్యంతో జిల్లా ఉద్యాన శాఖ ప్రత్యేకంగా అవగాహన పర్యటనను నిర్వహించింది.జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎ. సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది రైతులను హైదరాబాద్లో జరుగుతున్న "రైతుబడి అగ్రి షో"కు తీసుకువెళ్లి, వ్యవసాయ రంగంలో అమలు అవుతున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను ప్రత్యక్షంగా పరిచయం చేశారు.అగ్రి షోలో ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శన స్టాళ్లను రైతులు ఆసక్తిగా సందర్శించి, వ్యవసాయంలో కొత్తగా ప్రవేశిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ విధానాలు, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులపై సమగ్ర అవగాహన పొందారు. ముఖ్యంగా డ్రోన్ల వినియోగం ద్వారా పంటలపై ఎరువులు, పురుగుమందుల పిచికారీ, స్మార్ట్ ఇరిగేషన్ వ్యవస్థలు, నేల తేమ ఆధారిత నీటి పంపిణీ విధానాలు, అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాల ఎంపిక, సమర్థవంతమైన ఎరువుల వినియోగంపై ప్రదర్శనలు రైతులను ఆకట్టుకున్నాయి.పంట సంరక్షణలో వినియోగించే ఆధునిక యంత్రాలు, ఆటోమేటెడ్ పరికరాలు, వ్యవసాయ ఉత్పాదకతను పెంచే పరికరాల ప్రదర్శనలు రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించే విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించిన రైతులు, తమ పొలాల్లో ఈ సాంకేతికతలను అమలు చేయాలనే ఆసక్తిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎ. సునీల్ కుమార్ మాట్లాడుతూ,వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను అవలంబించడం ద్వారా రైతులు ఉత్పాదకతను పెంచడమే కాకుండా వ్యయాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు.ఇలాంటి అగ్రి షోలు రైతులకు మార్గదర్శకంగా నిలుస్తాయని,మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులు కొత్త పద్ధతులను స్వీకరించడం అవసరమని పేర్కొన్నారు.ఈ అవగాహన పర్యటనలో మహాదేవపూర్ ఉద్యాన అధికారి వై. మణి, విస్తరణ అధికారి రామ్ దాస్, భూపాలపల్లి,కాటారం ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.అధికారుల మార్గదర్శకత్వంలో రైతులు ప్రతి స్టాల్‌ను సందర్శించి,తమ పంటల అవసరాలకు అనుగుణమైన సాంకేతిక పరిష్కారాలపై వివరాలు సేకరించారు.ఈ పర్యటనతో భూపాలపల్లి జిల్లాలో ఉద్యాన పంటల సాగులో సాంకేతిక ఆధారిత పద్ధతుల అమలు వేగవంతం అవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.రైతులు కొత్త జ్ఞానంతో తిరిగి వెళ్లి తమ పొలాల్లో ఆధునిక వ్యవసాయాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా జిల్లాలో వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# స్వీట్ కార్న్‌ను తింటే మనకు లాభమా.. నష్టమా..?



హెల్త్ న్యూస్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): స్వీట్ కార్న్ చాలా రుచిగా ఉంటుంది. దీనితో రకరకాల చిరుతిళ్లను తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. స్వీట్ కార్న్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. చాలా మంది దీనిలో ఎక్కువగా పిండి పదార్థాలే ఉంటాయని భావిస్తారు. కానీ వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. అయితే చాలా మంది దీనికి దూరంగా ఉంటారు. దీనిలో కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయని దీనిని తీసుకోవడం వల్ల శరీర బరువు పెరుగుతుందని చాలా మంది భావిస్తారు. కానీ దీనిని తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని డయాబెటిస్ ఉన్నవారు కూడా దీనిని తీసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అయితే వీటిని ఉడికించి లేదా తేలికగా కాల్చి తీసుకున్నప్పుడు మాత్రమే ఆరోగ్య ప్రయోజనాలను పొందగలమని నిపుణులు చెబుతున్నారు. స్వీట్ కార్న్ ను ఉడికించి తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

జీర్ణక్రియకు సహాయం..

స్వీట్ కార్న్ లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు మద్దతును ఇస్తుంది. ప్రేగు కదలికలు పెరుగుతాయి. మలబద్దకం సమస్య తగ్గుతుంది. దీనిలో ఉండే కరగని ఫైబర్ జీర్ణక్రియకు మద్దతును ఇస్తుంది. దీంతో గట్ మైక్రోబయోమ్ పోషకాల శోషణను పెంచుతుంది. స్వీట్ కార్న్ లో జియాక్సంతిన్, లుటీన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్ వల్ల కలిగే ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కణ ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయి. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండె జబ్బులు, కంటి వ్యాధులు వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు రాకుండా చేయడంలో సహాయపడతాయి. స్వీట్ కార్న్ సంక్లిష్ట కార్బోహైడ్రేట్స్ ను కలిగి ఉంటుంది. ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. కనుక శక్తి స్థాయిలు స్థిరంగా ఉంటాయి. పిల్లలు, ఆటలు ఎక్కువగా ఆడేవారు వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

కళ్ల ఆరోగ్యానికి..

వీటిలో ఫైబర్ తో పాటు పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు కూడా ఉంటాయి. స్వీట్ కార్న్ ను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. స్వీట్ కార్న్ లో కెరోటినాయిడ్లతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. వయసు సంబంధిత మాక్యులర్ క్షీణత, అంధత్వం, దృష్టి లోపాలు రాకుండా ఉంటాయి. కంటి చూపు మెరుగుపడుతుంది. స్వీట్ కార్న్ లో డైటరీ ఫైబర్ ఉండడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఆకలి ఎక్కువ సమయం వరకు కాకుండా ఉంటుంది. దీంతో తక్కువ ఆహారాన్ని తీసుకునే అవకాశం ఉంటుంది. ఇది శరీర బరువును అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది. ఈ విధంగా స్వీట్ కార్న్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని దీనిని తప్పకుండా ఆహారంలో భాగంగా తీసుకునే ప్రయత్నం చేయాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అయితే వీటిని ఉడికించి లేదా కాల్చి తీసుకోవాలని, వీటిని ఉప్పు, వెన్న, కారం, మసాలా వంటి వాటితో కలిపి తీసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు.

# అసలు జుట్టు ఎందుకు రాలుతుంది..? ఏయే ఆహారాలను తీసుకోవాలి..?



హెల్త్ న్యూస్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): జుట్టు ఎక్కువగా ప్రోటీన్ తో తయారవుతుంది. జుట్టు పెరుగుదల చక్కగా ఉండాలన్నా, జుట్టు బలంగా, ఆరోగ్యంగా ఉండాలన్నా పోషకాహారాన్ని తీసుకోవడం చాలా అవసరం. శరీరంలో అవసరమైన పోషకాల స్థాయిలు తగ్గినప్పుడు శరీరం ఇతర ముఖ్యమైన అవయవాలకు పోషకాలను అందిస్తుంది. ఫలితంగా జుట్టు పెరుగుదల మందగిస్తుంది. జుట్టు రాలడం ఎక్కువవుతుంది. జుట్టు కుదళ్లు బలహీనంగా తయారవుతాయి. జుట్టు పొడిబారడంతో పాటు పెలుసుగా తయారవుతుంది. కనుక జుట్టు సమస్యలతో బాధపడే వారు ముందుగా వారి ఆహారపు అలవాట్లను చూసుకోవడం చాలా ముఖ్యం.

చక్కెర, రిఫైన్డ్ పిండి..

చక్కెర కలిగిన ఆహారాలను, శుద్ది చేసిన పిండితో తయారు చేసిన ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. ఇన్సులిన్ నిరోధకత పెరుగుతుంది. హార్మోన్ల అసమతుల్యతకు దారి తీస్తుంది. కాలక్రమేణా ఇది శరీరంలో వాపును పెంచుతుంది. దీంతో జుట్టు కుదళ్లు బలహీనంగా తయారవుతాయి. కనుక వీటికి బదులుగా ఓట్స్, బ్రౌన్ రైస్, తృణ ధాన్యాలు వంటి వాటిని తీసుకోవాలి. ఫైబర్ కలిగిన ఆహారాలను తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. బర్గర్లు, ఫ్రైస్, ప్యాక్ చేసిన ఆహారాలను తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది. వీటిలో ఉప్పు, ప్రిజర్వేటివ్స్, అనారోగ్య కొవ్వులు ఉంటాయి. వీటిలో జుట్టు పెరుగుదలకు అవసరమయ్యే ఎటువంటి పోషకాలు ఉండవు. ప్రాసెస్ చేసిన ఆహారాలను తీసుకోవడం వల్ల పోషకాల లోపం తలెత్తుతుంది. దీంతో జుట్టుకు రక్తప్రసరణ సరిగ్గా జరగక జుట్టు వేగంగా రాలిపోతుంది.

పాదరసం ఉండే చేపలు..

అలాగే అధిక పాదరసం కలిగిన స్వోర్డ్ ఫిష్, కింగ్ మాకెరెల్ వంటి చేపలల్లో పాదరసం ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల జుట్టు పలుచగా మారుతుంది. కనుక తక్కువ పాదరసం కలిగిన సాల్మన్, సార్డిన్స్ వంటి చేపలను తీసుకోవడం మంచిది. విటమిన్ ఎ సప్లిమెంట్స్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా జుట్టు ఎక్కువగా రాలిపోతుంది. శరీరంలో విటమిన్ ఎ స్థాయిలను పరీక్షించుకోకుండానే చాలా మంది సప్లిమెంట్స్ ను తీసుకుంటున్నారు. దీంతో జుట్టు కుదుళ్లు విశ్రాంతి దశలోకి వెళ్లి జుట్టు పెరుగుదల తగ్గిపోతుంది. ఆల్కాహాల్ శరీరంపై అన్ని విధాలుగా ప్రభావాన్ని చూపుతుంది. దీని వల్ల జుట్టు ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. ఆల్కహాల్ శరీరం డీహైడ్రెటెడ్ గా మారేలా చేస్తుంది. జింక్ స్థాయిలను తగ్గిస్తుంది. జింక్ స్థాయిలు తగ్గడం వల్ల జుట్టు కణజాల పెరుగుదల, మరమ్మత్తు కూడా తగ్గుతుంది. దీని వల్ల జుట్టు రాలడం ఎక్కువవుతుంది. కనుక జుట్టు రాలే సమస్యతో బాధపడే వారు ఆల్కహాల్ కు దూరంగా ఉండడం మంచిది.

తీపి పదార్థాలు..

కృత్రిమ తీపి పదార్థాలు కొన్ని సార్లు జుట్టు పలచబడడానికి కారణమవుతాయి. కనుక జుట్టు ఎక్కువగా రాలే సమస్యతో బాధపడే వారు కొంతకాలం స్వీటెనర్లను తీసుకోవడం తగ్గించాలి. ఇక ప్రోటీన్ తీసుకోకపోవడం వల్ల కూడా జుట్టు ఎక్కువగా రాలుతుంది. జుట్టు కెరాటిన్ అనే ప్రోటీన్ తో తయారవుతుంది. ఆహారంలో ప్రోటీన్ లేకపోవడం వల్ల జుట్టు పెరుగుదల నెమ్మదిస్తుంది. జుట్టు బలహీనంగా మారడం, పలుచబడడం జరుగుతాయి. అధిక క్రాష్ డైట్స్ చేయడం ద్వారా క్యాలరీలను తీసుకోవడం పూర్తిగా తగ్గిస్తారు. దీంతో జుట్టు పెరుగుదల మందగిస్తుంది. జుట్టు రాలడం ఎక్కువవుతుంది. కనుక సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూనే బరువును అదుపులో ఉంచుకునే ప్రయత్నం చేయాలి. అధికంగా ఉప్పు తీసుకోవడం వల్ల రక్తప్రసరణ సరిగ్గా ఉండదు. దీంతో జుట్టు కుదుళ్లు బలహీనపడతాయి. కనుక ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలతో పాటు ఉప్పును తీసుకోవడం కూడా తగ్గించాలి.

వీటిని తీసుకోవాలి..

ఈ విధంగా ప్రతి ఒక్కరూ తీసుకునే ఆహారం కూడా మన జుట్టు పెరుగుదలపై ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. జుట్టు సమస్యలతో బాధపడే వారు, జుట్టు పెరుగుదల వేగంగా ఉండే వారు సరైన ఆహారాన్ని తీసుకోవాలి. ఆహారంలో ప్రోటీన్, ఐరన్, జింక్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ సి ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. అలాగే నీటిని ఎక్కువగా తాగాలి. రోజూ 7 గంటల పాటు నిద్రించాలి. ఒత్తిడిని అదుపులో ఉంచుకోవాలి. రసాయనాలు కలిగిన జుట్టు ఉత్పత్తులను వాడకూడదు. ఇలా జుట్టు పెరుగుదలకు కావల్సిన ఆహారాన్ని తీసుకుంటూ, చక్కని జీవనశైలిని పాటించడం వల్ల చక్కని ఆరోగ్యవంతమైన, బలమైన జుట్టును సొంతం చేసుకోవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

# పవర్‌ఫుల్ షాట్ కొట్టిన హార్దిక్ పాండ్యా.. తీవ్రంగా గాయపడ్డ ఇండియన్ బౌలర్



స్పోర్ట్స్ న్యూస్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): టీ20 వరల్డ్‌కప్ లో ఇండియన్ జట్టును గాయాలు వీడడం లేదు. సూపర్ 8 స్టేజ్‌కి ప్రిపేరవుతున్న దశలో భారత బృందానికి మరో జలక్ తగిలింది. అహ్మదాబాద్‌లో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో హార్దిక్ పాండ్యా కొట్టిన పవర్‌ఫుల్ షాట్‌కు స్పీడ్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ గాయపడ్డాడు. ప్యాండ్ బాదిన షాట్‌కు బంతి నేరుగా వెళ్లి సిరాజ్ మోకాలికి తగిలింది. దీంతో అతను తీవ్ర ఇబ్బందిపడ్డాడు. నొప్పి తట్టుకోలేకపోయాడు. చాలా అవస్థపడినట్లు తెలుస్తోంది. వాస్తవానికి టోర్నీకి ముందు గాయపడ్డ హర్షిత్ రాణా స్థానంలో సిరాజ్‌కు చివరి నిమిషంలో అవకాశం ఇచ్చారు.

గ్రూప్ స్టేజ్‌లో అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో ఆడిన సిరాజ్ .. మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే మిగితా మ్యాచుల్లో సిరాజ్‌ను పక్కనపెట్టేసి బుమ్రా, హర్షదీప్‌లకు అవకాశం ఇచ్చారు. సూపర్ 8 దశలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కీలకం కానున్నట్లు భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కల్ తెలిపారు. ఆదివారం దక్షిణాఫ్రికాతో ఇండియా తలపడనున్నది. వరల్డ్‌కప్‌లో వరుణ్ నిలకడగా వికెట్లు తీస్తున్నట్లు మోర్కల్ చెప్పారు.

# పాకిస్థాన్ కోచ్‌పై కైఫ్ ఫైర్.. "భారతీయుడిని కోచ్‌గా నియమించుకోండి" అంటూ సెన్సేషనల్ కామెంట్స్!




స్పోర్ట్స్ న్యూస్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): టీ20 ప్రపంచకప్‌లో భారత్ చేతిలో పాకిస్థాన్ ఘోర పరాజయం పాలవ్వడంపై ఇప్పటికీ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పాక్ కోచ్ మైక్ హెస్సన్ అనుసరించిన వ్యూహాలపై టీమిండియా మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ నిప్పులు చెరిగారు. కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా 61 పరుగుల తేడాతో పాక్‌ను చిత్తుచిత్తుగా ఓడించిన సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో కోచ్‌గా పనిచేసిన అనుభవం ఉన్న ప్రస్తుత పాక్ హెడ్ కోచ్ మైక్ హెస్సన్, భారత్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారని కైఫ్ మండిపడ్డారు.

ఈ సందర్భంగా మొహమ్మద్ కైఫ్ మాట్లాడుతూ.. "స్లో పిచ్‌పై టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోవడం ఏంటి? హెస్సన్ ఫ్రీగా డబ్బులు తీసుకుంటున్నారా?" అంటూ కైఫ్ ఘాటుగా ప్రశ్నించారు. పాక్ జట్టు కొత్త కెప్టెన్ సల్మాన్ అఘాకు అనుభవం లేకపోయినా, అనుభవజ్ఞుడైన కోచ్ సరైన సలహాలు ఇవ్వడంలో విఫలమయ్యారని విమర్శించారు. సాధారణంగా లెగ్ స్పిన్నర్లను పవర్‌ప్లే తర్వాత (6 ఓవర్ల తర్వాత) బౌలింగ్‌కు దించుతారు. కానీ, పాకిస్థాన్ అబ్రార్ అహ్మద్‌ను 4వ ఓవర్‌లోనే రంగంలోకి దించి తప్పు చేసిందని కైఫ్ అభిప్రాయపడ్డారు. కొత్త బంతితో లెగ్ స్పిన్ వేయడం కష్టమని, దానివల్ల రన్స్ ఎక్కువగా వచ్చాయని, ఆ తర్వాత ఆ బౌలర్‌ను జట్టు నుంచి తొలగించడం దారుణమని అన్నారు. విదేశీ కోచ్‌ల కాలం చెల్లిపోయిందని, వారు కేవలం పేపర్ మీద రాసుకున్న ప్లాన్లనే నమ్ముకుంటారని కైఫ్ ఎద్దేవా చేశారు. "పాకిస్థాన్ ఇకనైనా మారాలి. విదేశీయులను వదిలేసి, ఒక భారత కోచ్‌ను నియమించుకోవాలి. టీ20 క్రికెట్ అనేది ప్రతి ఓవర్‌కు మారుతుంటుంది, దానికి తగ్గట్టు నిర్ణయాలు తీసుకునే కోచ్ పాక్‌కు అవసరం" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఎంఎస్ ధోని, రోహిత్ శర్మ వంటి కెప్టెన్లు కోచ్‌తో కలిసి వ్యూహాలు రూపొందిస్తారు. వాళ్లు ఏ, బీ, సి, డి లను ప్లాన్ చేసి, పరిస్థితికి అనుగుణంగా వాటిని మారుస్తారు" అని చెప్పారు.

# సంజూ శాంసన్ రిటర్న్, బౌలింగ్‌లో కీలక మార్పులు.. దక్షిణాఫ్రికాతో ఆడే భారత్ ఫైనల్ టీమ్ ఇదే!




స్పోర్ట్స్ న్యూస్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఈరోజు నుంచి సూపర్-8 మ్యాచ్‌లు ఆరంభం కానున్నాయి. నేడు కొలంబోలో పాకిస్తాన్, న్యూజిలాండ్ టీమ్స్ తలపడనున్నాయి. ఇక భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఆదివారం (ఫిబ్రవరి 22) తలపడనున్నాయి. ఈ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో రాత్రి 7 గంటలకు ఆరంభం కానుంది. టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లో ఈ రెండు తలపడగా.. భారత్ గెలిచి టైటిల్ ఎగరేసుకుపోయింది. మరోసారి దక్షిణాఫ్రికాపై గెలిచి సూపర్-8లో ముందడుగు వేయాలని టీమిండియా చూస్తోంది. భారత్‌పై గెలిచి ఫైనల్ ప్రతీకారం తీర్చుకోవాలని సఫారీలు చుస్తున్నారు. ఈ నేపథ్యంలో మ్యాచ్ రసవత్తరంగా సాగే అవకాశాలు ఉన్నాయి.

దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్‌కు ముందు టీమిండియా నెట్ ప్రాక్టీస్‌లో ఆసక్తికర పరిణామాలు కనిపించాయి. ముఖ్యంగా కేరళ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ అహ్మదాబాద్‌లో సుదీర్ఘ సమయం నెట్స్‌లో చెమటోడ్చాడు. సంజూ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న తీరు చూస్తుంటే.. దక్షిణాఫ్రికా మ్యాచ్‌లో ప్లేయింగ్ 11లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. యువ ఆటగాడు తిలక్ వర్మ స్థానంలో అతడు ఆడే అవకాశాలు ఉన్నాయి. గత కొన్ని మ్యాచ్‌లుగా ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో.. తెలుగు ఆటగాడు తిలక్‌ను పక్కన పెట్టి సంజూకు అవకాశం ఇవ్వాలని టీమ్ మేనేజ్‌మెంట్ చూస్తున్నట్లు తెలుస్తోంది. మిడిల్ ఆర్డర్‌ను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

వరుసగా మూడు డకౌట్స్ అయిన ఓపెనర్ అభిషేక్ శర్మపై టీమ్ మేనేజ్‌మెంట్ నమ్మకం ఉంచనుంది. సూపర్-8 లాంటి కీలక దశలో అతడు లయ అందుకుంటే టీమిండియాకు మంచి ఆరంభం దక్కుతుంది. ఇషాన్ కిషన్ ఇప్పటికే మెరుపులు మెరిపిస్తున్నాడు. కిషన్ నుంచి మరో కీలక ఇన్నింగ్స్ జట్టు కోరుకుంటోంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య పరుగులు చేస్తుండడం కలిసొచ్చే అంశం. ఇక హిట్టర్ శివమ్ దూబె మంచి దూకుడు మీదున్నాడు. అతడు బాదే సిక్సులు చూస్తే మతిపోతోంది. రింకూ సింగ్ తనకు వచ్చిన అవకాశాల్లో రఫ్ఫాడిస్తున్నాడు.

బౌలింగ్ లైనప్‌లో కూడా కొన్ని అనూహ్య మార్పులు జరగనున్నట్లు తెలుస్తోంది. వాషింగ్టన్ సుందర్ స్థానంలో స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. బ్యాటింగ్ డెప్త్‌తో పాటు పొదుపైన బౌలింగ్ కోసం అక్షర్ వైపు మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతోందట. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్థానంలో లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్షదీప్ సింగ్ జట్టులోకి వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. పిచ్ కండిషన్స్, డెత్ ఓవర్ల స్పెషలిస్ట్ అవసరం దృష్ట్యా అర్షదీప్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ గౌతమ్ గంభీర్ భావిస్తున్నారట. బుమ్రా, చక్రవర్తి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దక్షిణాఫ్రికా వంటి బలమైన జట్టును ఢీకొట్టడానికి ఈ మార్పులు అవససరం అని ఫాన్స్, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జట్టు మార్పులలో ఎంత నిజముందో తెలియాలంటే.. మరికొన్ని గంటలు వెయిట్ చేయాల్సిందే.

భారత్ ఫైనల్ టీమ్:

అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్షదీప్ సింగ్.


# రాధ ఆల్‌రౌండ్ షో.. ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్




స్పోర్ట్స్ న్యూస్, 21 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో భారత మహిళల క్రికెట్ జట్టు 'ఏ' జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం బ్యాంకాక్‌లో జరిగిన సెమీస్‌లో శ్రీలంక 'ఏ' జట్టుపై 5 వికెట్ల తేడాతో గెలిచింది. కెప్టెన్ రాధ యాదవ్(4/19, 31) ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 19.4 ఓవర్లలో కేవలం 118 రన్స్‌కే ఆలౌటైంది. ఆ టీమ్‌లో సంజన కావిండి(31), శశిని గిమ్హాని(22) మాత్రమే చెప్పుకోదగ్గ రన్స్ చేయగా.. మిగతా వారు విఫలమయ్యారు. భారత కెప్టెన్, బౌలర్ రాధ యాదవ్ 4 వికెట్లతో విజృంభించింది. ఆమెకుతోడు తనూజ, ప్రేమ రావత్ చెరో 2 వికెట్లు పడగొట్టడంతో శ్రీలంక స్వల్ప స్కోరుకే కుప్పకూలింది.

ఇక, 119 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత జట్టు 13.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మంచి ఫామ్‌లో ఉన్న వృంద దినేశ్ ఈ మ్యాచ్‌లోనూ మెరిసింది. 20 బంతుల్లో 42 రన్స్ చేసి ఆకట్టుకుంది. అనుష్క శర్మ(27) కూడా పర్వాలేదనిపించింది. బంతితో విజృంభించిన రాధ బ్యాటుతోనూ మెరిసి ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసింది. 18 బంతుల్లో 31 పరుగులతో అజేయంగా నిలిచి భారత్‌ను గెలిపించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన రాధ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. మరో సెమీస్‌లో పాకిస్తాన్ 'ఏ' జట్టును బంగ్లాదేశ్ 'ఏ' టీమ్ చిత్తు చేసింది. ముందుగా బంగ్లా 110/8 స్కోరు చేయగా.. ఛేదనలో పాక్ 56 పరుగులకే ఆలౌటైంది. దీంతో బంగ్లా ఫైనల్‌కు దూసుకొచ్చింది. ఆదివారం భారత్ 'ఏ', బంగ్లా 'ఏ' జట్ల మధ్య ఫైనల్ జరగనుంది.

# సినిమా న్యూస్




## విశ్వంభర చుట్టూ ఎన్ని కష్టాలో.. అసలు సమస్య అదేనా?

మెగాస్టార్ చిరంజీవి చాలా రోజుల క్రితం విశ్వంభర చిత్రాన్ని మొదలు పెట్టాడు. త్రిష ఇందులో హీరోయిన్గా కనిపించనుండగా, మల్లాడి వశిష్ట దర్శకత్వం వహిస్తున్నాడు. ఎం ఎం కీరవాణి సంగీత సారథ్యంలో రూపొందుతున్న ఈ మూవీని యువి క్రియేషన్స్ బ్యానర్ పై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని స్టార్ట్ చేసిన తర్వాత కొంతకాలానికే దీనిని 2025 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఈ సినిమాకు సంబంధించిన పనులు చాలా పెండింగ్లో ఉన్నాయి అని, దాంతో సంక్రాంతికి కాకుండా వేరే సమయంలో విడుదల చేస్తాము అని, కొత్త రిలీజ్ డేట్ ను త్వరలోనే ప్రకటిస్తామని మేకర్స్ చెప్పుకొచ్చారు.

ఆ తర్వాత కొంతకాలానికి చిరంజీవి స్వయంగా విశ్వంభరని 2026 సమ్మర్లో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించాడు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈ సినిమా ఈ సమ్మర్ లో కూడా విడుదల అయ్యే అవకాశాలు కనబడటం లేదు. ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని మేకర్స్ ప్రకటించలేదు. ఈ మూవీ స్టార్ట్ అయిన తర్వాత చాలా కాలానికి మొదలైన మన శంకర వరప్రసాద్ గారు విడుదల అయ్యి ఇప్పటికే టాలీవుడ్ రీజనల్ ఇండస్ట్రీ హిట్ కావడంతో విశ్వంభర పరిస్థితి ఏమవుతుందా అని మెగా ఫ్యాన్స్ కాస్త టెన్షన్ పడుతున్నారు.

ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం విశ్వంభర మూవీకి సంబంధించిన విడుదల తేదీ అనౌన్స్ కావాలంటే ముందుగా ఓటీటీ డీల్ పూర్తి కావాలి, అది పూర్తి కావాలంటే రేటు ఫైనల్ కావాలి. ధర ఫైనల్ కావాలంటే మొదట కాపీ పూర్తి కావాలని తెలుస్తుంది. దీనిని బట్టి చూస్తే ఈ సినిమా విడుదల తేదీ రావాలంటే మొదట ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ కాపీ రెడీ కావాలి. అది చూసి ఓటీటీ వారు ఒక ధర ఫిక్స్ చేసి, డేట్ కూడా కన్ఫామ్ చేస్తే అప్పుడు ఈ సినిమా విడుదల తేదీ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## 46 ఏళ్ల తర్వాత

### కమల్ - రజనీ రీయూనియన్


భారతీయ సినీ ప్రపంచంలో గర్వించదగ్గ దిగ్గజాలు కమల్ హాసన్, రజనీకాంత్ మరోసారి కలిసి తెరపై కనిపించనున్నారు. దాదాపు 46 ఏళ్ల తర్వాత ఈ లెజెండరీ స్టార్స్ స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటంతో అభిమానుల్లో ఉత్సాహం ఉప్పొంగుతోంది. తాజాగా ఈ క్రేజీ మల్టీస్టారర్ను అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ స్పెషల్ గ్లింప్స్ విడుదల చేశారు. ప్రస్తుతం 'KHxRK' అనే వర్కింగ్ టైటిల్తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'జైలర్' ఫేమ్ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత బాధ్యతలను యువ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ తీసుకున్నారు. భారీ బడ్జెట్తో ఈ ప్రాజెక్ట్ను రెడ్ జెయింట్ మూవీస్ నిర్మిస్తోంది.

తాజాగా విడుదలైన గ్లింప్స్లో కమల్–రజనీ ఇద్దరూ స్టైలిష్ లుక్స్లో కనిపిస్తూ 'నువ్వా నేనా?' అన్నట్టుగా పోటాపోటీగా మెరిశారు. ముందుగా ఎవరి రూమ్లోకి వెళ్లాలన్న విషయంలో నెల్సన్ కన్ఫ్యూజ్ అవ్వడం, అనిరుధ్ టూ–ఫింగర్ టెక్నిక్తో ఏ రాగం కంపోజ్ చేయాలనేది సెలెక్ట్ చేసుకోవడం వంటి సన్నివేశాలు ఫ్యాన్స్కు వినోదాన్ని పంచుతున్నాయి. కాస్ట్యూమ్స్, బూట్లు, బెల్ట్, వాచ్, కళ్లద్దాలు ఇలా ప్రతి అంశంలో ఇద్దరి డామినేషన్ స్పష్టంగా కనిపించేలా వీడియోను రూపొందించారు. ఇద్దరూ స్టైల్గా నడుచుకుంటూ వచ్చి ఒకరికొకరు ఎదురెదురుగా నిలబడే షాట్ హైలైట్గా నిలిచింది. రజనీ తనదైన శైలిలో కారు కీ ఇవ్వడం, దాన్ని కమల్ అందుకుని డ్రైవింగ్ సీట్లో కూర్చోవడం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. చివర్లో 'ఎవరు హీరో?' అని ఇద్దరూ అడిగే సన్నివేశం ఆసక్తిని మరింత పెంచుతోంది.

ఇద్దరు దిగ్గజాలు గతంలో పలు చిత్రాల్లో కలిసి నటించినప్పటికీ, ఈసారి రాబోతున్న ఈ ప్రాజెక్ట్పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమాటోగ్రఫీని రాజీవ్ మీనన్, ఎడిటింగ్ను ఆర్. నిర్మల్, ఆర్ట్ డైరెక్షన్ను డీఆర్కే కిరణ్ నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఈ మల్టీస్టారర్కు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. మొత్తంగా చెప్పాలంటే, KHxRK అనౌన్స్మెంట్ వీడియోతోనే బాక్సాఫీస్ వద్ద సంచలనాలకు నాంది పలికింది. కమల్–రజనీ రీయూనియన్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## లక్కీ ఛాన్స్ కొట్టేసిన మీనాక్షి చౌదరి



టాలీవుడ్ లక్కీ భామ మీనాక్షి చౌదరి దశ తిరిగింది. 'ఖిలాడి', 'హిట్ 2', 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్న ఈ హర్యానా బ్యూటీ, ఇప్పుడు బాలీవుడ్లో గ్రాండ్ ఎంట్రీకి సిద్ధమైంది. హిందీ స్టార్ హీరో అక్షయ్ కుమార్ సరసన అత్యంత ప్రతిష్టాత్మకమైన 'భాగమ్ భాగ్ 2' చిత్రంలో హీరోయిన్గా నటించే గోల్డెన్ ఛాన్స్ దక్కించుకుంది. 2006లో అక్షయ్ కుమార్, గోవిందా, పరేష్ రావల్ కాంబినేషన్లో వచ్చిన 'భాగమ్ భాగ్' ఎంత పెద్ద హిట్ అయ్యిందో తెలిసిందే. ఇప్పుడు దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వస్తున్న ఈ సీక్వెల్ను రాజ్ శాండిల్య తెరకెక్కిస్తున్నారు.ఒరిజినల్ మూవీ తరహాలోనే పక్కా కామెడీ ఎంటర్టైనర్గా రూపొందుతున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కీలక పాత్రలో కనిపించబోతోంది.

ఈ సినిమాలో మీనాక్షితో పాటు విలక్షణ నటుడు మనోజ్ బాజ్పాయ్ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుండటం విశేషం. అంతేకాకుండా, బిగ్ బాస్ ఫేమ్ ఆయేషా ఖాన్ కూడా ఈ ప్రాజెక్ట్లో భాగం కానుంది. సీనియర్ నటుడు పరేష్ రావల్ ఈసారి డబుల్ రోల్లో కనిపించబోతున్నారని సమాచారం. వరుస సినిమాలతో బిజీగా ఉన్న మీనాక్షికి, అక్షయ్ కుమార్ వంటి టాప్ స్టార్ పక్కన అవకాశం రావడం ఆమె కెరీర్లో పెద్ద మైలురాయిగా మారనుంది. 2021లో టాలీవుడ్లోకి అడుగుపెట్టిన మీనాక్షి, అతి తక్కువ సమయంలోనే స్టార్ హీరోల సరసన నటించే స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం ఆమె 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి సినిమాలతో ఫుల్ ఫామ్లో ఉంది. ఇప్పుడు హిందీలో కూడా పాగా వేయాలని చూస్తోంది. 'భాగమ్ భాగ్ 2' షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ సినిమా సక్సెస్ అయితే బాలీవుడ్లో మీనాక్షికి మరిన్ని అవకాశాలు రావడం ఖాయం.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.